సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
బుధవారం, 26.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 296
పేజీలు: 08 వెల: రూ. 5

అఖండ గోదారిని ఆరాధించేలా

## పుష్కరాలు

భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు, పవిత్రతకు పెద్దపీట: ఏపీ సీఎం

- 10 కోట్ల మంది పుణ్య స్నానాలు చేస్తారని అంచనా
- 181 కొత్త ఘాట్ల నిర్మాణంతో సహా 440 ఘాట్ల అభివృద్ధి
- మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు
- గోదావరి పుష్కరాలపై ముఖ్యమంత్రి సమీక్ష

03



## కాంగ్రెస్‌కు డెడ్‌లైన్.!

### ఫీజు బకాయిలపై బండి ఫైర్

- రూ.15 వేల కోట్ల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?
- 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన
- హామీలిచ్చి మోసం చేశారంటూ కాంగ్రెస్‌పై విమర్శలు
- ఫీజు బకాయి.. బీజేపీ లడాయి అంటూ పోరాటం ఉధృతం



03

## కొత్త ముఖాలకు చోటు!

### కేంద్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం

**ముద్ర డెస్క్ :**
త్వరలో కేంద్ర కేబినెట్ విస్తరణ జరగనున్నట్లు వార్తలు వస్తున్నాయి. త్వరలో ఏడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఉత్తర ప్రదేశ్, గుజరాత్, గోవా, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, పంజాబ్‌లో ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు దేశంలో జెన్–జీ ఉద్యమం సాగుతున్న తరుణంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేయాలని మోదీ భావిస్తున్నట్లుగా వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఇటీవలే బీజేపీ అధ్యక్షుడు నితిన్ నవీన్ కొత్త బృందాన్ని ఏర్పాటు చేశారు. మిగతా 02లో



- ఎన్నికల రాష్ట్రాలపై మోదీ ఫోకస్..
- యువతకు పెద్దపీట..
- 12 ఖాళీల భర్తీకి కసరత్తు..
- 2029 టార్గెట్‌గా మోదీ వ్యూహం..
- మంత్రుల పనితీరుపై వేటు?
- మిత్రపక్షాలకు మంత్రి పదవులు..
- యూపీ నుంచి గుజరాత్ వరకు..
- కొత్త మంత్రులపై మోదీ కసరత్తు

## క్లైమాక్స్‌కు కొండా ఎపిసోడ్

### టీపీసీసీ చేతికి సంచలన రిపోర్ట్

### కొండా సురేఖపై వేటుకు రంగం సిద్ధం!

- సురేఖ, చిన్నారెడ్డిపై కఠిన చర్యలకు సిఫారసు!
- కాంగ్రెస్‌లో కీలక మలుపు
- హైకమాండ్ కోర్టులోకి సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారం!
- క్రమశిక్షణ కమిటీ సంచలన నిర్ణయం!
- రేవంత్ టార్గెట్ ఎఫెక్ట్
- పార్టీ లైన్ దాటితే వేటే మల్లు రవి కీలక వ్యాఖ్యలు!
- ఇద్దరి భవితవ్యంపై హైకమాండ్‌దే తుది నిర్ణయం!



**ముద్ర డెస్క్:**
మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ఇద్దరిపై క్రమశిక్షణ కమిటీ రూపొందించిన నివేదికను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు కమిటీ ఛైర్మన్ మల్లు రవి, వైస్ ఛైర్మన్ శ్యామ్ మోహన్ అందించారు. ఈ నివేదికను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో పాటు ఏఐసీసీ పెద్దలకు కూడా పంపినట్లు మల్లు రవి వెల్లడించారు.
పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి, చిన్నారెడ్డిని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలని క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. ఇద్దరి వ్యవహార శైలితో పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చిందని కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. అయితే తుది నిర్ణయం మాత్రం కాంగ్రెస్ అధిష్ఠానానిదేనని మల్లు రవి స్పష్టం చేశారు.

**కూతురి వ్యాఖ్యలతో వివాదం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కొండా సురేఖ క్రమశిక్షణ కమిటీ ముందు వివరణ ఇచ్చినప్పటికీ, కమిటీ మాత్రం చర్యలకు సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో సురేఖను కాపాడటం సాధ్యం కాదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో సంచలనంగా మారాయి.

**చిన్నారెడ్డి వ్యవహారంలోనూ వివాదం**

మరోవైపు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిపై చిన్నారెడ్డి తీవ్ర ఆరోపణలు చేయడం కూడా పార్టీలో కలకలం మిగతా 02లో

## హైదరాబాద్‌లో శంకర్ దాదాలు

### 11 మంది నకిలీ డాక్టర్ల అరెస్టు

- డిగ్రీలు లేకున్నా డాక్టర్ల అవతారం
- అంతా నర్సులు, కాంపౌండర్లు, మెడికల్ షాపు ఓనర్లే!
- ప్రజల ప్రాణాలతో చెలగాటం..

**ముద్ర, హైదరాబాద్:**
డాక్టర్ వృత్తికి ఉన్న డిమాండ్ ను క్యాష్ చేసుకోవాలని.. కనీసం స్టెతస్కోప్ పట్టుకోడానికి కూడా అర్హత లేని వాళ్లు డాక్టర్ల అవతారం ఎత్తారు. జనాలా ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఫేక్ డాక్టర్లపై టాస్క్ ఫోర్స్ పోలీసులు స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. 2026 ఆగస్టు 25న నిర్వహించిన దాడుల్లో 11 మంది నకిలీ వైద్యులు పట్టబడ్డారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు సికింద్రాబాద్, జూబ్లీహిల్స్ జోన్ లలో రైడ్స్ నిర్వహించారు. తనిఖీల్లో 11 మంది ఫేక్ డాక్టర్స్‌తో పాటు ఒక మెడికల్ షాప్ యజమానిని పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో అందరూ నర్సులు, కాంపౌండర్ల, మెడికల్ షాప్ ఓనర్లు ఉన్నట్లుగా చెబుతున్నారు. కొన్ని మందుల పేర్లు తెలియటం, డాక్టర్ల దగ్గర పనిచేసిన అనుభవంతో ఏకంగా క్లినిక్ లు పెట్టి చెలామణి అవుతుండటం పోలీసులను ఆశ్చర్యానికి గురిచేసింది.



ఈ నకిలీ డాక్టర్లు రోజుకు 20 మందికి ట్రీట్‌మెంట్ ఇస్తున్నట్టు గుర్తించారు. కాంపౌండర్ గా పని చేసి డాక్టర్లు గా చెప్పుకుంటున్నట్లు స్థానికులు చెప్పారు. వైద్యావతారం ఎత్తటంతో పాటు మెడిసిన్స్ కూడా సొంతంగా తయారు చేస్తున్నట్లు ఆరోపణలు రావటం ఆందోళన కలిగిస్తోంది. అన్ని ప్రమాణాలతో తయారు చేసే మందులే ఒక్కోసారి రియాక్షన్ అయ్యి ప్రాణలమీదికి వస్తున్న తరుణంలో.. వైద్య విద్యపై కనీస అవగాహన లేని వీళ్లు మందులు తయారు చేసి అమాయకులను ఏం చేస్తారా అనేదే అసలు ప్రశ్న. నిందితులను కఠినతంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## భారత్‌కు షీ జిన్‌పింగ్!

ఏడేళ్ల తర్వాత భారత్‌కు

- 12, 13 తేదీల్లో చైనా అధ్యక్షుడి పర్యటన
- బ్రిక్స్ సదస్సుకు రాక!
- జిన్‌పింగ్ పర్యటనకు ముందే దోవల్ చైనా టూర్

02



భారత వ్యతిరేకి మద్దానీతో రేవంత్ భేటీ

## ఎందుకు?

### ఎందుకు కలవాలి?

- రేవంత్ అమెరికా టూర్‌పై కిషన్‌రెడ్డి ఫైర్
- రాజకీయ ప్రేరేపిత భేటీలతోనే టూర్ క్యాన్సిల్
- విదేశాంగ అనుమతి రాకపోవడానికి అసలు కారణమిదే!

02



## ఇస్లాంలో హిజాబ్ తప్పనిసరి కాదు

- యూనిఫాంపై వ్యక్తిగత నిర్ణయాలు తగవు
- అమలు చేసే బాధ్యత స్కూల్ యాజమాన్యానిదే
- అలహాబాద్ హైకోర్టు తీర్పు

02





## కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం

02

- ₹13 వేల కోట్ల పనులకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్
- బిహార్ లో నాలుగు లైన్ల హైవే

ప్రధాని అధ్యక్షతన కొనసాగుతున్న మంత్రి మండలి భేటీ

ఏపీ సహా నాలుగు రాష్ట్రాల్లో మల్టీ ట్రాకింగ్ పనులు

## నేడు ఈద్-మిలాద్-ఉన్-నబి

03

ప్రవక్త బోధనలను స్మరించుకోనున్న ముస్లింలు



## కమీషన్ల కోసమే దోపిడీ!

03

### 22A భూములపై హరీశ్ రావు ఫైర్



- సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీలో పోరాటం
- దశాబ్దాల నాటి పట్టా భూములూ నిషేధిత జాబితాలో
- 22A భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

ఇదీ AI ముద్ర

### హైదరాబాద్‌లో 12 మంది నకిలీ వైద్యుల అరెస్ట్



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం, 26.08.2026
www.mudranews.in | @mudranews



## తలనొప్పి, మైగ్రేన్ : నీరు పుష్కలంగా తాగాలి



శరీరంలో నీరు తగ్గడం కొందరిలో మైగ్రేన్‌కు కారణమవుతుంది. రోజంతా తగినంత నీరు తాగుతూ హైడ్రేషన్‌ను కాపాడుకోవడం ముఖ్యం.

# హిజాబ్ ఇస్లాంలో తప్పనిసరి కాదు

**ముద్ర,ఢిల్లీ :**
విద్యార్థుల వస్త్రధారణ విషయంలో విద్యాసంస్థలు రూపొందించిన నిబంధనలను వ్యక్తిగత అభిరుచులు లేదా ఆచారాల పేరుతో మార్చుకునే హక్కు ఉండదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. పాఠశాల నిర్దేశించిన డ్రెస్ కోడ్‌ను విద్యార్థులు తప్పనిసరిగా పాటించాల్సిందేనని పేర్కొంది. హిజాబ్ ధరించేందుకు అనుమతించాలని కోరుతూ ఓ విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.



**హిజాబ్ కు అనుమతి కోరిన విద్యార్థిని**
ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థిని.. అదే పాఠశాలలో 11వ తరగతిలో చేరేందుకు సిద్ధమైంది. అయితే తాను ఆరో తరగతి నుంచి తన మత సంప్రదాయాలకు అనుగుణంగా హిజాబ్ ధరిస్తున్నానని, 11వ తరగతిలోనూ దానిని కొనసాగించేందుకు పాఠశాల యాజమాన్యాన్ని అనుమతించేలా ఆదేశించాలని కోరుతూ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ ఇంద్రజీత్ శుక్లాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

**ఫొటోలను పరిశీలించిన ధర్మాసనం**
విచారణ సందర్భంగా విద్యార్థిని వివిధ తరగతుల్లో ఉన్నప్పటి ఫొటోలను ధర్మాసనం పరిశీలించింది. ఆమె తప్ప మిగిలిన విద్యార్థులు ఎవరూ హెడ్‌స్కార్ఫ్ ధరించి కనిపించలేదని కోర్టు పేర్కొంది. అంతేకాకుండా పిటిషనర్ మతానికి చెందిన ఇతర విద్యార్థులు కూడా అదే తరగతిలో ఉన్నప్పటికీ వారు హెడ్‌స్కార్ఫ్ ధరించలేదని గమనించింది. విద్యాసంస్థలో అమలులో ఉన్న డ్రెస్ కోడ్‌ను ఒక విద్యార్థి తన వ్యక్తిగత ఇష్టానికి అనుగుణంగా మార్చుకోవడం సాధ్యం కాదనే అభిప్రాయాన్ని ధర్మాసనం వ్యక్తం చేసింది.

**ఆర్టికల్ 25పై కోర్టు కీలక వ్యాఖ్యలు**
హిజాబ్ ధరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కింద రక్షణ పొందే అత్యవసరమైన మతపరమైన ఆచారం కాదని ధర్మాసనం పేర్కొంది. ఇదే అంశంపై వివిధ హైకోర్టుల్లో విచారణ జరిగిన సందర్భాల్లోనూ ఇదే తరహా అభిప్రాయాలు వ్యక్తమైనట్లు కోర్టు గుర్తుచేసింది. అందువల్ల విద్యాసంస్థలు నిర్దేశించిన యూనిఫాం, వస్త్రధారణ నియమాలను విద్యార్థులు పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. వ్యక్తిగత మత విశ్వాసాలు ఉన్నప్పటికీ విద్యాసంస్థ నిబంధనలకు లోబడి ఉండాల్సిన అవసరం ఉందనే విషయాన్ని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.

# కొత్త ముఖాలకు చోటు!

(మొదటి పేజీ తరువాయి)
ఈ ఏర్పాటు నేపథ్యంలో మోడీ కూడా మంత్రివర్గంలో మార్పులు చేయొచ్చని సమాచారం. రాబోయే కొద్ది నెలల్లోనే ఈ మార్పు జరగవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మంత్రివర్గంలో యువత సంఖ్య పెరిగే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ప్రస్తుతం డెబ్బై ఏళ్లు పైబడిన 12 మంది కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రులు స్వతంత్ర బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 81 ఏళ్ల జితన్ రామ్ మాంఝీ అత్యంత పెద్ద వయసున్న మంత్రి కాగా.. 38 ఏళ్ల రామ్ మోహన్ నాయుడు పిన్న వయస్కుడున్నారు. ఇటీవల ముగ్గురు మంత్రులు కూడా రాజీనామా చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్, రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టు రిజైన్ చేశారు. దీంతో ప్రస్తుతం 29 మంది కేబినెట్ మంత్రులు, స్వతంత్ర బాధ్యతలు కలిగిన ఐదుగురు సహాయ మంత్రులు, 34 మంది సహాయ మంత్రులు ఉన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 75(1A) ప్రకారం గరిష్టంగా 81 మంది సభ్యులు ఉండవచ్చు. దీంతో 12 పదవులు ఖాళీగా ఉన్నాయి. దీంతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగొచ్చని పేర్కొన్నారు.
మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలువురు ప్రస్తుత మంత్రులను తొలగించే అవకాశం కూడా ఉంది. ఉదాహరణకు ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు హర్ష్ మల్హోత్రా, ఉత్తర ప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి వంటి ఇద్దరు సహాయ మంత్రులు నియమితులయ్యారు. వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను బీజేపీ కోశాధికారిగా కూడా నియమించారు. పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి, సాంఘిక న్యాయ శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మల రాజ్యసభ పదవీకాలం నవంబర్‌లో ముగుస్తుంది. పనితీరు ఆధారంగా కూడా కొంత మంది మంత్రులను తొలగించే అవకాశం ఉంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేసేటప్పుడు 2029 లోక్‌సభ ఎన్నికలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది.
మంత్రివర్గంలో కొత్త మిత్రపక్షాలకు చోటు దక్కవచ్చని కూడా ప్రచారం జరుగుతోంది. డీఎంకే, ఎన్‌సీపీ–ఎస్పీ, అకాలీ దళ్‌లు ఎన్‌డీఏలో చేరతాయో లేదోనని అందరి దృష్టి వాటిపైనే ఉంది. టీఎంసీ రెబెల్స్ ఏర్పాటు చేసిన ఎన్‌సీపీ నుంచి ఒక మంత్రిని నియమించవచ్చని కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పంజాబ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలలో ఒకరిని మంత్రివర్గంలో చేర్చుకోవచ్చని సమాచారం. అదనంగా శివసేనకు కూడా మంత్రి పదవి లభించవచ్చు. ఎందుకంటే శివసేన యూబీటీకి చెందిన ఆరుగురు ఎంపీలు చేరడంతో ఆ పార్టీ బలం 13కి పెరిగింది. శివసేన నుంచి శ్రీకాంత్ షిండే పేరు వినిపిస్తోంది.
ఈ మంత్రివర్గంలో మహిళలు, యువత సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇక మంత్రివర్గంలో ప్రస్తుతం పద్నాలుగు మంది మంత్రులు ఒకటి కంటే ఎక్కువ మంత్రిత్వ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ మంత్రుల్లో అమిత్ షా, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్, హెచ్‌డీ కుమారస్వామి, పీయూష్ గోయల్, లల్లన్ సింగ్, ప్రహ్లాద్ జోషి, అశ్విని వైష్ణవ్, జ్యోతిరాదిత్య సింధియా, గజేంద్ర సింగ్ శెఖావత్, కిరణ్ రిజిజు, మన్సుఖ్ మాండవియా, కిషన్ రెడ్డి బహుళ పోర్ట్‌ఫోలియోలను నిర్వహిస్తున్నారు. తత్ఫలితంగా కొంత మంది మంత్రులపై పనిభారం తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కొత్త ముఖాలను కేబినెట్‌లోకి తీసుకురావాలనే చర్చ జరుగుతోంది. త్వరలోనే ఈ ప్రక్రియ జరగొచ్చని తెలుస్తోంది.



# కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం..

**ముద్ర ఢిల్లీ :**
ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం కేంద్ర కేబినెట్ సమావేశం కొనసాగుతోంది. దేశంలో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడం, రైల్వేలు, రహదారుల విస్తరణకు సంబంధించిన పలు ప్రతిపాదనలపై ఈ భేటీలో చర్చిస్తున్నారు. మొత్తం 27 అంశాలను మంత్రివర్గం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో సుమారు రూ.13 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో మల్టీ ట్రాకింగ్ పనులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. అదేవిధంగా బిహార్‌లో నాలుగు లేన్ల హైవే నిర్మాణానికి కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులతో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు మరింత ఊపందుకునే అవకాశం ఉంది. మొత్తంగా దేశ మౌలిక వసతుల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం మరోసారి దృష్టి సారించినట్లు తాజా కేబినెట్ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి.

# మమ్దానీతో రేవంత్ భేటీ ఎందుకు?

**ముద్ర హైదరాబాద్ :**
అమెరికా పర్యటన అంశంలో కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దిల్లీలో నిర్వహించిన మీడియాలో సమావేశంలో ఆయన మాట్లాడారు. "కేంద్రం అనుమతి రాకుండానే రేవంత్‌రెడ్డి ఆదరాబాదరాగా అమెరికా పర్యటన చేపట్టారు. అర్హతలేని వ్యక్తులను సీఎం తన పర్యటనలో కలవాలని నిర్ణయించుకున్నారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. యూఎస్ పర్యటనపై రేవంత్‌రెడ్డి స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. విదేశాంగశాఖ అనుమతి ఇవ్వకపోవడానికి రాజకీయాలు ఆపాదించడం సరికాదు. 2005లో గుజరాత్ సీఎంగా మోదీ ఉన్నప్పుడు అమెరికా పర్యటనను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంది. గతంలో మరి కొందరు సీఎంల విదేశీ పర్యటనలకూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. సొంత పార్టీ సీఎంలకు కూడా అనుమతి ఇవ్వని సందర్భాలు ఉన్నాయి. విదేశాల్లో మన సీఎంలు ఎవరిని కలుస్తారు.. వాటితో దేశానికి ఏం ప్రయోజనం అనేది విదేశాంగశాఖ పరిశీలిస్తుంది. మన దేశ విదేశాంగ విధానాన్ని బట్టే కేంద్రం అనుమతి ఇస్తుంది. పాక్‌కు అనుకూలంగా ఉంటూ మన దేశంపై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మమ్దానీ. భారత ప్రధాని మోదీని ఆయన గతంలో దూషించారు. న్యూయార్క్‌లో హిందువులు నిర్వహించుకునే పండుగలపై ఆంక్షలు విధించారు. అలాంటి వ్యక్తిని కలవాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించుకున్నట్లు వార్తలు వచ్చాయి. భారత వ్యతిరేకితో రేవంత్ భేటీ ఎందుకు? కేవలం పరిపాలనా పరమైన కారణాలతోనే విదేశాంగశాఖ రేవంత్ పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి తన స్థాయికి తగిన వారితో చర్చించాలి. విదేశాలకు సీఎం వెళ్లకుండా కూడా పెట్టుబడులు సాధించవచ్చు. అధికారులను పంపించి కూడా పెట్టుబడులు, ఒప్పందాలు సాధించవచ్చు" అని కిషన్‌రెడ్డి అన్నారు.



# భారత్‌కు షీ జిన్‌పింగ్!



**ముద్ర, ఢిల్లీ :** చైనా అధినేత షీ జిన్‌పింగ్ వచ్చే నెల 12, 13 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నట్లు సమాచారం. దిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సుల్లో పాల్గొనేందుకు ఆయన భారీ బృందంతో వచ్చే అవకాశముందని తెలిసింది. ఆయన వస్తే ఏడేళ్ల తర్వాత భారత్‌కు రావడం ఇదే తొలిసారి అవుతుంది. కాగా భారత జాతీయ భద్రత సలహాదారు అజీత్ డోభాల్ సోమవారం చైనా రాజధాని బీజింగ్‌కు చేరుకున్నారు. ఆయన రెండు రోజులపాటు ఆ దేశంలో పర్యటించనున్నారు. సరిహద్దు అంశాలపై మంగళవారం జరిగే రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో పాల్గొంటారు. చైనా విదేశాంగ శాఖ మంత్రి, జాతీయ భద్రత సలహాదారు అయిన వాంగ్ ఈ తోనూ ఆయన సమావేశమవుతారు.

# క్లైమాక్స్‌కు కొండా ఎపిసోడ్

(మొదటి పేజీ తరువాయి)
రేపింది. ఈ వ్యవహారంపై మేఘారెడ్డి ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు వ్యవహారాలపైనా అధిష్ఠానం దృష్టి సారించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**రేవంత్‌తో భేటీకి మల్లు రవి**
టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు నివేదిక అందించిన క్రమశిక్షణ కమిటీ నేతలు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా కలవనున్నట్లు మల్లు రవి తెలిపారు. పార్టీ లైన్ దాటితే ఎంతటివారైనా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫారసు చేసిందని వెల్లడించారు. ఇక కొండా సురేఖ, చిన్నారెడ్డి విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది. కమిటీ సిఫారసులు అమలైతే రాష్ట్ర కాంగ్రెస్‌లో ఇది కీలక పరిణామంగా మారే అవకాశం ఉంది.





# రావల్పిండి కైవసం..

## సైనిక పాలనలోకి పాకిస్తాన్



**ముద్ర డెస్క్:**
పాకిస్తాన్ రాజకీయాల్లో సైన్యం ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తుంది. జియా–ఉల్–హక్, అయూబ్ ఖాన్, యాహ్యా ఖాన్, పర్వేజ్ ముషారఫ్ లాంటి నాయకుల కాలంలో ప్రత్యక్ష లేదా పరోక్ష నియంతృత్వం కనిపించింది. ఈ తరహాలోనే ప్రస్తుతం ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ నాయకత్వంలో సైనిక శక్తి మరింత బలపడుతున్నట్లు కనిపిస్తోంది. రాజ్యాంగ సవరణలు, కొత్త చట్టాలు, సైనిక మోహరింపులు దీనికి ఆధారాలుగా నిలుస్తున్నాయి.

**రావల్పిండిలో సైనిక మోహరింపు..**

2026, ఆగస్టు 21న ఫెడరల్ ప్రభుత్వం ఆర్టికల్ 245 కింద రావల్పిండిలో మూడు సైనిక కంపెనీలను ఆరు నెలలపాటు మోహరించేందుకు అనుమతి ఇచ్చింది. పంజాబ్ హోమ్ డిపార్ట్‌మెంట్ అభ్యర్థన మేరకు ఇది జరిగింది. అధికారికంగా 'సెన్సిటివ్ సెక్యూరిటీ డ్యూటీస్', 'అనవసర పరిస్థితులు నివారణ', జిల్లా పరిపాలనకు సహకారం అని చెప్పారు. రావల్పిండి సైనిక జనరల్ హెడ్‌క్వార్టర్స్ ఉన్న ప్రాంతం కావడం వల్ల దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. అయితే ఈ నిర్ణయానికి మూడు కారణాలు ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

**పీటీఐ లాంగ్ మార్చ్ అడ్డుకోవాలి..**

ఈ నిర్ణయం సెప్టెంబర్ 27న ప్లాన్ అయిన పీటీఐ లాంగ్ మార్చ్‌కు కొన్ని వారాల ముందు వచ్చింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం, జైలు హక్కులు, కేసులు సంబంధించి పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతోంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆసుపత్రికి తరలించి తిరిగి జైలుకు తీసుకెళ్లిన సంఘటనలు కూడా ఉన్నాయి. సైనిక మోహరింపు పూర్తి నియంత్రణ కాదు; సివిల్ అడ్మినిస్ట్రేషన్‌కు సహాయకంగా ఉంటుందని అధికారిక వైఖరి. అయినా రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇది జాగ్రత్త చర్యగా కనిపిస్తోంది.

**ఆసిమ్ మునీర్ అధికారాల విస్తరణ..**

రెండో కారణం గత సంవత్సరం 27వ రాజ్యాంగ సవరణ ద్వారా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (సీడీఎఫ్) పోస్ట్ ఏర్పాటైంది. ఆసిమ్ మునీర్ ఆర్మీ చీఫ్‌గా ఉండగానే ఈ బాధ్యతలు చేపట్టారు. 2026 ఆగస్టులో డిఫెన్స్ ఫోర్సెస్ యాక్ట్ 2026తో సైన్యం, నావికా, వాయుసేనలపై ఏకీకత కమాండ్, సిబ్బంది నియామకాలు, రిటైర్మెంట్, సర్వీస్ పొడిగింపు లాంటి విస్తృత అధికారాలు వచ్చాయి. ఫీల్డ్ మార్షల్ హోదా, కొన్ని రక్షణలు కూడా ఉన్నాయి. ఇవి గత సైనిక పాలకుల లాంటి ప్రత్యక్ష అధికారం కాకపోయినా, సివిల్–సైనిక సమతుల్యతను మరింత సైన్యం వైపు మళ్లిస్తున్నాయి.

**రాజకీయ, రాజ్యాంగ ప్రతిపాదనలు..**

ఓటింగ్ వయస్సు 18 నుంచి 25కు పెంచే ప్రతిపాదనలు గతంలో చర్చల్లోకి వచ్చాయి. కొందరు సలహాదారులు మాట్లాడినా, ప్రభుత్వం అధికారికంగా తిరస్కరించింది. ప్రావిన్సుల పునర్వ్యవస్థీకరణ, గిల్గిట్–బాల్టిస్తాన్‌ను రాష్ట్రంగా చూపడం, సూపర్ సెనేట్ ఏర్పాటు లాంటివి కూడా చర్చల్లో ఉన్నట్లు చెప్పబడుతున్నాయి. కానీ ఇవి ఇంకా అధికారిక రూపం తీసుకోలేదు. అమలైతే యువకుల ఓటు హక్కు, ప్రాంతీయ సమతుల్యతపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇమ్రాన్ ఖాన్ పాపులారిటీ ఇప్పటికీ బలంగా ఉండడం, పీటీఐ ఉద్యమాలు సైనిక–ప్రభుత్వ వ్యూహాలపై ప్రభావం చూపుతున్నాయి.

**అంతర్గత సవాళ్లు..**

బలూచిస్తాన్‌లో విభజనవాద గ్రూపులు స్వాతంత్ర్యం ప్రకటనలు, స్వతంత్ర దినోత్సవాలు నిర్వహిస్తున్నాయి. కానీ అంతర్జాతీయ గుర్తింపు లేదు, పాకిస్తాన్ నియంత్రణ కొనసాగుతోంది. ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా, సింధ్, పీవోకేలో కూడా ఉద్రిక్తతలు ఉన్నాయి. ఇవి దేశ అంతర్గత బలహీనతలను చూపుతున్నాయి. కశ్మీర్ సమస్యపై అమెరికా వంటి దేశాల స్పష్ట వైఖరి కూడా పాక్ వ్యూహాలను ప్రభావితం చేస్తోంది. ప్రస్తుత పరిణామాలు పూర్తి సైనిక తిరుగుబాటు లాంటివి కావు. సివిల్ ప్రభుత్వం అనుమతితో సైన్యం సహాయక పాత్రలో ఉంది. అయినా ఆసిమ్ మునీర్ అధికారాల విస్తరణ, రావల్పిండి మోహరింపు, పీటీఐ ఉద్యమాలపై నియంత్రణ చర్యలు సైన్యం రాజకీయంగా మరింత బలపడుతున్నట్లు సూచిస్తున్నాయి. చరిత్రలో ఇలాంటి పరిణామాలు తరచుగా అధ్యక్ష పాలన లేదా మరింత కేంద్రీకృత అధికారం వైపు దారి తీశాయి. అంతర్గత అశాంతి, ఆర్థిక సవాళ్లు, ప్రాంతీయ సమస్యలు కొనసాగితే పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 26.08.2026
www.mudranews.in | @mudranews



## తలనొప్పి , మైగ్రేన్ : నుదుటిపై చల్లని కాపడం

మైగ్రేన్ మొదలైనప్పుడు నుదుటిపై టవల్‌లో చుట్టిన చల్లని ప్యాక్ లేదా చల్లని వస్త్రాన్ని ఉంచడం నొప్పిని కొంత తగ్గించడంలో సహాయ పడవచ్చు.



# కాంగ్రెస్‌కు డెడ్‌లైన్.!

**ఫీజు బకాయిలపై బండి సంజయ్ ఫైర్..**
**రూ.15 వేల కోట్ల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?**
**40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన**
**హామీలిచ్చి మోసం చేశారంటూ కాంగ్రెస్‌పై విమర్శలు**
**ఫీజు బకాయి.. బీజేపీ లడాయి అంటూ పోరాటం ఉధృతం**

**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక విద్యాసంస్థలకు కనీస బకాయిలు చెల్లించడం చేతగాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విదేశీ విశ్వవిద్యాలయాలను రప్పిస్తామనడం అత్యంత హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ. 15 వేల కోట్లకు చేరుకోవడంతో వేలాది ప్రైవేట్ కళాశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయని, లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారం**

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్ విద్యనభ్యసిస్తున్న దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని బండి సంజయ్ పేర్కొన్నారు. వీరిలో అత్యధికులు దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారేనని, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిలిచిపోవడంతో వీరంతా ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. బకాయిలు రాకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయని, దీంతో విద్యార్థులు పైచదువులకు వెళ్లలేక, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థులు వివక్షను, అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తోందని మండిపడ్డారు.

**మాట తప్పడంలో బీఆర్ఎస్‌ను మించిపోయిన కాంగ్రెస్**

వన్ టైమ్ సెటిల్‌మెంట్ (OTS) కింద ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలన్నీ చెల్లిస్తామని, నిర్ణీత వ్యవధిలోనే నిధులు విడుదల చేస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని బండి సంజయ్ ప్రశ్నించారు. హామీలిచ్చి మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించిపోయిందని విమర్శించారు. కళాశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు జీతాలు ఇచ్చుకోలేక, మెయింటెనెన్స్ చార్జీలు భరించలేక తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకుపోయాయని, ఫీజులు అడిగితే బెదిరింపులకు దిగడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని హితవు చెప్పారు.



**"ఫీజు బకాయి – బీజేపీ లడాయి".. పోరాటం ఉధృతం చేస్తాం**

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు చేపట్టిన ''ఫీజు బకాయి – బీజేపీ లడాయి'' దీక్షకు బండి సంజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ దీక్షకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, ప్రజా సంఘాల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ. 15 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో రామచంద్రరావు నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచేదాకా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## నేడు ఈద్ మిలాద్ ఉన్ నబి పవిత్ర వేడుక




**ముద్ర, దేవరకొండ :** ముస్లింలు అత్యంత పవిత్రంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే వేడుక మిలాద్ ఉన్ నబి ఈ పవిత్ర పర్వదినాన, ముస్లిం సోదరులు ప్రత్యేకంగా ప్రార్ధనలు నిర్వహిస్తారు. అలాగే అల్లా దయతో ప్రపంచమంతా శాంతియుతంగా ఉండాలని కోరుకుంటారు. మిలాద్ ఉన్ నబీ అంటే అరబిక్‌లో ప్రవక్త జన్మదినం అని అర్థం. కనుక ఈ శుభ సందర్భంగా ముస్లిం సోదరులు పవిత్ర గ్రంథం ఖురాన్ పఠనం చేస్తారు. అలాగే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వేడుక నిర్వహిస్తారు. ప్రవక్త ముహమ్మద్ గారి పవిత్ర జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈద్ మిలాద్–ఉన్–నబీ పండుగ మంగళవారం సాయంత్రం నుంచి ప్రారంభమై బుధవారం సాయంత్రం వరకు కొనసాగుతుంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ఉపవాస దీక్షల్లో కూడా పాటిస్తారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మూడో నెల అయిన రబీ–అల్–అవ్వల్' 12వ రోజున ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. ప్రవక్త మహమ్మద్ సమాజానికి అందించిన ప్రేమ, కరుణ, న్యాయం, సహనం, సమానత్వం వంటి దివ్యమైన బోధనలను ఈ రోజున స్మరించుకుంటారు. క్రీ.శ. 570లో పవిత్ర మక్కా నగరంలో జన్మించిన ప్రవక్త మహమ్మద్, ఇదే రోజున పరమపదించారని కూడా ముస్లిమ్స్ విశ్వసిస్తారు. ఈ సందర్భంగా మసీదులు, వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు, ఊరేగింపులు జల్సాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. ఈద్ మిలాద్ ఉన్ నబీ అంటే ప్రవక్త ముహమ్మద్ గారి పవిత్ర జన్మదినాన్ని స్మరించుకునే సందర్భం. ముస్లిం సమాజంలోని అనేక వర్గాలు ఈద్ మిలాద్ ఉన్ నబి రోజును భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. అయితే మిలాద్ ఉన్ నబి జరుపుకునే విధానాలు, ఆచారాలు ప్రాంతం మతపరమైన సంప్రదాయాల ప్రకారం మారుతూ ఉంటాయి.

**మిలాద్ ఉన్ నబీ ప్రాముఖ్యత ఏమిటి**

ఈ పర్వదినం ఎందుకు జరుపుకుంటారు అంటే

ప్రవక్త ముహమ్మద్ జీవితాన్ని, ఆయన బోధించిన శాంతి, ప్రేమ, కరుణ, మానవత్వం వంటి విలువలను స్మరించుకోవడమే మిలాద్ ఉన్ నబీ ఉద్దేశం అని చెప్పవచ్చు. ప్రవక్త ముహమ్మద్ జన్మదినాన్ని స్మరించుకోవడం ఈ సందర్భంగా ప్రవక్త మహమ్మద్ జననం, జీవితం, ఆయన బోధనలు, ఆదర్శాలను గుర్తుచేసుకుంటారు. ఆయన బోధనలను జీవితంలో ఆచరించడం నిజాయితీ, దయ, క్షమ, సహనం, పేదల పట్ల ప్రేమ, మానవత్వం వంటి విలువలను గుర్తుచేసుకుంటారు.

**అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియజేయడం**

ప్రవక్తను మానవాళికి మార్గదర్శకుడిగా పంపినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రార్థనలు చేస్తారు. సోదరభావం, ఐక్యతను చాటడం

కుల, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా పరస్పరం ప్రేమ, గౌరవంతో మెలగాలని ఈ సందర్భం గుర్తుచేస్తుంది. పేదలకు, అవసరమైన వారికి సహాయం చేయడం అనేక ప్రాంతాల్లో మిలాద్ సందర్భంగా అన్నదానం, దానధర్మాలు, పేదలకు సహాయం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రవక్త మహమ్మద్ జీవిత చరిత్ర, ఆయన చూపిన మార్గం, సమాజం పట్ల ఆయన సందేశాలను ప్రజలకు వివరించే కార్యక్రమాలు జరుగుతాయి. మిలాద్ ఉన్ నబీ కేవలం ఒక పండుగగా మాత్రమే కాకుండా మంచి జీవితాన్ని గుర్తు చేసే రోజుగా కూడా భావిస్తారు. మన చుట్టూ ఉన్నవారిని గౌరవించడం, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం, ద్వేషానికి దూరంగా ఉండటం వంటి సందేశాలను ఈ రోజు గుర్తు చేస్తుంది. ముహమ్మద్ ప్రవక్త గారు చూపిన సన్మార్గంలో మీ జీవితం సాగాలని కోరుకుంటూ సర్వ మానవాళికి ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు.

## 'కమీషన్ల కోసమే దోపిడీ!'

**22A భూములపై హరీశ్ రావు ఫైర్..**
**22A వ్యవహారంలో భారీ కమీషన్ల ఆరోపణలు**
**దశాబ్దాల నాటి పట్టా భూములూ నిషేధిత జాబితాలో**
**22A భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్**
**సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీలో పోరాటం: హరీశ్ రావు**



**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్రంలో 22A నిషేధిత భూముల వ్యవహారంపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కమీషన్ల కోసమే సామాన్యుల ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. కుత్బుల్లాపూర్ షాపూర్ నగర్ లో 22A బాధిత కుటుంబాల సమావేశంలో పాల్గొన్న ఆయన, స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్నతో కలిసి బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.22A వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి ఏ–1, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఏ–2గా ఉన్నారని హరీశ్ రావు ఆరోపించారు. 98 శాతం భూములను జాబితా నుంచి తొలగించామని మంత్రి చెబుతున్నది అబద్ధమన్నారు. దశాబ్దాల నాటి పట్టా భూములను సైతం 22Aలో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి ఎకరాల వ్యవసాయ భూములు 22Aలో ఉండటంతో రైతులకు రైతుబంధు, ఎరువులు, విద్యుత్ కనెక్షన్ల సమస్యలు వస్తున్నాయని అన్నారు.22A భూముల వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాను వెబ్ సైట్ లో ఎందుకు బ్లాక్ చేశారో వెల్లడించాలన్నారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని కోరారు. సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అవసరమైతే సభను స్తంభింపజేసి బాధితులకు న్యాయం జరిగేలా పోరాడతామని స్పష్టం చేశారు.

# అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

**భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు, పవిత్రతకు పెద్దపీట**
**10 కోట్ల మంది పుణ్య స్నానాలు చేస్తారని అంచనా**
**181 కొత్త ఘాట్ల నిర్మాణంతో సహా 440 ఘాట్ల అభివృద్ధి**
**మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు**
**గోదావరి పుష్కరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష**

**ముద్ర, అమరావతి :** ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతన మమేకమయ్యేలా 2027 గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

పుష్కరాల కోసం రూ.4,026 కోట్లతో 4,932 పనులు చేపడుతుండగా, ఇప్పటికే రూ.899 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, ఏలూరు, కాకినాడ, పోలవరం జిల్లాల్లో ఈ పనులు కొనసాగుతున్నాయి. అవసరమైన నిధుల సమీకరణతో పాటు కేంద్ర సాయాన్ని పొందాలని సీఎం సూచించారు.

**8–10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం**

2015 మహా పుష్కరాల్లో 4.86 కోట్ల మంది భక్తులు హాజరుకాగా, 2027లో 8 నుంచి 10 కోట్ల మంది వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని 440 ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. వీటిలో 259 ఘాట్ల అభివృద్ధితో పాటు 181 కొత్త ఘాట్ల నిర్మాణం చేపడుతున్నారు.



**టెంపుల్ టూరిజానికి ప్రాధాన్యం**

పిఠాపురం శక్తిపీఠం, పంచారామాలు, ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి పుణ్యక్షేత్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని చంద్రబాబు సూచించారు. భక్తుల కోసం హోం స్టేలను ప్రోత్సహించడంతో పాటు కొత్త హోటళ్లకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. రాజమహేంద్రవరంలో కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలని, కూచిపూడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలను భారీగా నిర్వహించాలని సూచించారు.

గోదావరిలోకి మురుగునీరు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, రహదారులు, బ్రిడ్జిలను పుష్కరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని చెప్పారు. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీప దీవుల అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

**ఏఐతో రద్దీ నియంత్రణ**

భద్రత, రద్దీ నిర్వహణ కోసం ఏఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు వంటి సాంకేతికతను వినియోగించనున్నారు. 30 తాత్కాలిక ఫీల్డ్ ఆస్పత్రులు, అంబులెన్స్‌లు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు.

పుష్కరాల కోసం 2,697 రెస్క్యూ బోట్లు, 8,955 మంది శిక్షణ పొందిన ఈతగాళ్లను సిద్ధం చేస్తున్నారు. 487 గ్రీన్ ఎనర్జీ బస్సులను వినియోగించడంతో పాటు 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు.

## దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలో పూర్తి చేస్తాం



**ముద్ర, హైదరాబాద్ :** దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలోగా 100 శాతం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. జలసౌధలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. భూసేకరణ, అనుమతులు, నిధులు, నిర్మాణ పనులు, కాంట్రాక్టు సమస్యలను గుర్తించి ప్రతి అంశానికి పరిష్కారం, బాధ్యత, గడువు నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు. స్పష్టమైన కార్యాచరణతో పనులను వేగవంతం చేసి ఎలాంటి కాలయాపన లేకుండా ప్రాజెక్టును పూర్తి చేయాలని సూచించారు.

## సంక్షేమ కమిటీల ప్రారంభ సమావేశం




**ముద్ర, హైదరాబాద్:** శాసన పరిషత్ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ తెగల సంక్షేమం, బీసీ సంక్షేమం, మహిళా–శిశు–దివ్యాంగులు–వృద్ధుల సంక్షేమ కమిటీల ప్రారంభ సమావేశం జరిగింది. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. ప్రజల సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కమిటీలు పనిచేయాలని వారు సూచించారు. క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి సమర్థవంతమైన సూచనలు, సిఫారసులు చేయాలని పేర్కొన్నారు.

## ఖరీఫ్ ధాన్యం సేకరణకు భారీ నిల్వ ఏర్పాట్లు



**ముద్ర, హైదరాబాద్:** ఖరీఫ్ 2026–27 ధాన్యం సేకరణకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ భారీగా నిల్వ ఏర్పాట్లు చేస్తోంది. గోదాములు, మార్కెట్ యార్డులు, ఖాళీ పారిశ్రామిక షెడ్లు, ఫంక్షన్ హాళ్లు, ఖాళీ ప్రదేశాలు, CAP కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. పాత నిల్వలను వేగంగా తరలించి కొత్త ధాన్యానికి స్థలం కల్పించనున్నారు. అలాగే PPCల ఆధునీకరణలో భాగంగా ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, మెకానికల్ స్టాకర్ల వినియోగంపై దృష్టి సారించారు. 'ఫార్మ్ టు సైలో' విధానంలో డిజిటల్ వెయ్‌బ్రిడ్జిలు, డ్రైయర్లు, బల్క్ సైలోలు, మిల్లింగ్ లింకేజీలను అనుసంధానించే అంశాన్ని సమీక్షించారు.

## ఎల్ నినో, నీట్ పై కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

**ముద్ర, హైదరాబాద్:** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు, పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీజనల్ పరిస్థితులు, NEET–PG పరీక్ష ఏర్పాట్లు, పర్యాటక అభివృద్ధిపై సమీక్షించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ నెల 30న జరగనున్న NEET–PG పరీక్షకు ఎలాంటి అవాంతరాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో భద్రత, విద్యుత్, తాగునీరు, రవాణా, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే తెలంగాణ టూరిజం 2047 పాలసీలో భాగంగా జిల్లాల్లోని చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సీఎస్ తెలిపారు. రాష్ట్రంలో గుర్తించిన 27 స్పెషల్ టూరిజం ఏరియాలను మెరుగుపరచడంతో పాటు స్పిర్చువల్, హెరిటేజ్, ఎకో, క్రాఫ్ట్స్ టూరిజాన్ని ప్రోత్సహించి తెలంగాణ బ్రాండ్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్పెషల్ సిఎస్ వాణిప్రసాద్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పోలీస్ శాఖ డిజి మహేశ్ భగవత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే దేశ సౌభాగ్యానికి పునాది




**ముద్ర, నిజామాబాద్:** రైతుల సంక్షేమమే రాష్ట్ర, దేశ సంక్షేమానికి పునాది అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలో మంగళవారం పసుపు రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సునహరి మిట్టి అభియాన్', మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలను ప్రారంభించారు. పసుపు సాగులో ఆధునిక సాంకేతికత, సహజ వ్యవసాయ పద్ధతులు, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, మెరుగైన మార్కెట్ అనుసంధానం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచాలని గవర్నర్ సూచించారు. నాణ్యమైన, అవశేష రహిత పసుపుకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. రైతులు, శాస్త్రవేత్తలు, ఎగుమతిదారులు, పరిశ్రమలు, ప్రభుత్వాలు సమష్టిగా పనిచేస్తే భారత పసుపుకు ప్రపంచ మార్కెట్‌లో మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. నిజామాబాద్‌కు పసుపు సాగులో ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడ జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు కావడం రైతుల చిరకాల కల సాకారమైనట్లేనని గవర్నర్ అన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా పసుపు రైతులు ఎదురుచూస్తున్న జాతీయ పసుపు బోర్డు నిజామాబాద్‌లో ఏర్పాటు కావడం చారిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పసుపు రైతులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
బుధవారం 26.08.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



రామాయణంలో సీతమ్మను రక్షించడం కోసం రాముని వానర సైన్యం సముద్రం మధ్యలో 30 మైళ్ల పొడవునా ఒక వంతెనను నిర్మించినట్లు మనం చదువుకుంటాం. నాసా (NASA) శాటిలైట్ ఫోటోలు సైతం భారతదేశానికి, శ్రీలంకకు మధ్య సముద్రం కింద వంతెన లాంటి నిర్మాణం ఉందని ధృవీకరించాయి. దీనిని కేవలం ఒక పురాణ గాథగా కాకుండా, ప్రాచీన భారతదేశపు వాస్తుశిల్పం మరియు భూగర్భ శాస్త్ర కోణంలో చూస్తే మన పూర్వీకుల జ్ఞానం మనల్ని విస్మయానికి గురిచేస్తుంది!

# లంకా వారధి

## ప్రపంచంలోనే మొట్టమొదటి మెరైన్ ఇంజనీరింగ్ అద్భుతం!

### నీటిపై తేలే రాళ్ల వెనుక ఉన్న రహస్య విజ్ఞానం.

సాధారణంగా సముద్రంలో రాళ్లను వేస్తే అవి మునిగిపోతాయి. కానీ, వానర సైన్యం ఉపయోగించిన రాళ్లు నీటిపై తేలాయని చెబుతారు. ఆధునిక భూగర్భ శాస్త్రం ప్రకారం, అగ్నిపర్వతాలు బద్దలైనప్పుడు ఏర్పడే 'ప్యూమిస్' (Pumice) అనే రంధ్రాలు కలిగిన రాళ్ల సాంద్రత నీటి కంటే తక్కువగా ఉంటుంది. అందువల్ల అవి నీటిపై తేలే గుణాన్ని కలిగి ఉంటాయి. ఆనాటి కాలంలోనే ఈ శాస్త్రీయ సూత్రాన్ని ఉపయోగించి వంతెనను నిర్మించారు.

### సముద్రపు లోతును అంచనా వేయడం

సముద్రం మధ్యలో వంతెనను నిర్మించడం సాదాసీదా విషయం కాదు. సముద్రపు అలల వేగం, నీటి ప్రవాహ దిశ, మరియు సముద్రపు లోతును ఖచ్చితంగా లెక్కించి, వంతెన స్థిరంగా నిలబడగలిగే ఒక నిర్దిష్టమైన 'ఇసుక తిన్నె'ను (sandbar) వారు ఎంచుకున్నారు. నేటి ఆధునిక ఇంజనీర్లు ఒక ఆనకట్ట లేదా వంతెనను నిర్మించే ముందు చేసే 'ఫీజిబిలిటీ స్టడీ' (Feasibility Study – సాధ్యసాధ్యాల అధ్యయనం) వంటి పరిశోధనను నలుడు మరియు నీలుడు అనే ఇద్దరు ఇంజనీర్లు ఆనాడే చేశారు!

### అత్యంత తక్కువ కాలంలో నిర్మాణం..

సుమారు 30 మైళ్ల (48 కి.మీ) పొడవున్న ఆ వంతెనను కేవలం 5 రోజుల్లోనే పూర్తి చేసినట్లు రామాయణం పేర్కొంది. మొత్తం సైన్యాన్ని క్రమబద్ధంగా విభజించి, రాళ్లను సేకరించేవారు, వాటిని మోసుకొచ్చేవారు, మరియు వంతెనను రూపకల్పన చేసేవారు అంటూ అక్కడ ఒక అద్భుతమైన 'ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్' (Project Management) కార్మిక సమన్వయాన్ని మనం చూడవచ్చు.

రామసేతు అనేది భారతదేశపు అసాధారణమైన సముద్ర సాంకేతిక పరిజ్ఞానానికి, ఉమ్మడి కృషికి దక్కిన ఒక చారిత్రక నిదర్శనం. మన పూర్వీకుల ఇంజనీరింగ్ నైపుణ్యం ఎల్లప్పుడూ ప్రపంచానికి మార్గదర్శకమే! మన సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పే ఈ సమాచారం మీకు నచ్చితే ఇతరులతో పంచుకోండి!

# డబ్బు కంటే విలువైనది ఏమిటి?

డబ్బు చుట్టూ ప్రపంచం తిరుగుతోంది
డబ్బు చుట్టూ మేధావులు
ఆలోచిస్తున్నారు..
డబ్బు చుట్టూ రాజకీయ నాయకులు
నిర్ణయాలు తీసుకుంటున్నారు..

డబ్బు అవసరం.
కానీ డబ్బే జీవితం కాదు.. డబ్బే
అన్నిటికీ పరిష్కారం కాదు.




డబ్బుతో ఇల్లు కొనగలం..
కానీ ఆ ఇంట్లో ఆనందాన్ని కొనలేం.
డబ్బుతో వైద్యం పొందగలం..
కానీ ఆరోగ్యాన్ని పూర్తిగా కొనలేం.
డబ్బుతో పదవి పొందగలం..
కానీ గౌరవాన్ని కొనలేం.
డబ్బుతో మనుషులను దగ్గర
చేసుకోవచ్చు..
కానీ నిజమైన ఆప్యాయతను కొనలేం.

డబ్బు కన్నా ఆరోగ్యం ముఖ్యం.
డబ్బు కన్నా మనశ్శాంతి ముఖ్యం.
డబ్బు కన్నా మానవత్వం ముఖ్యం.
డబ్బు కన్నా విలువలు ముఖ్యం.

ఎంత సంపాదించినా చివరికి మన
వెంట వచ్చేది డబ్బు కాదు.
మనతో మిగిలేది మన మంచితనం,
మన సేవ, మనం పాటించిన
విలువలు, మనం సంపాదించిన
గౌరవం.

డబ్బు మన వెంట రాదు..
కానీ మన విలువలు మనం లేకున్నా
మన పేరు వెంట నడుస్తాయి.

అందుకే..

డబ్బు సంపాదించండి..
కానీ డబ్బుకు బానిసలు కాకండి.

ఆస్తులు కూడబెట్టండి..
కానీ మానవత్వాన్ని కోల్పోకండి.

జీవితాన్ని సుఖంగా గడపండి..
కానీ సమాజానికి ఉపయోగపడేలా
జీవించండి.

డబ్బుతో జీవితం సౌకర్యవంతం
కావచ్చు---

విలువలతోనే జీవితం సార్థకం
అవుతుంది."

# సారంపల్లి మల్లారెడ్డి

## ఓ రైతాంగ

# విశ్వవిద్యాలయం

రైతు సమస్య వచ్చిందంటే ఓ పుస్తకం తెరవాల్సిన అవసరం ఉండేది కాదు.. సారంపల్లి మల్లారెడ్డిని అడిగితే చాలు. పంట ఏదైనా దాని సాగు నుంచి మార్కెట్ వరకు.. ప్రాజెక్టు ఏదైనా దాని ప్రయోజనం నుంచి ప్రభావం వరకు.. నదీజలాల వివాదం ఏదైనా దాని పూర్వాపరాల నుంచి పరిష్కార మార్గాల వరకు.. వేళ్ల మీద లెక్కించినట్లు వివరించేవారు. స్టాక్ మార్కెట్ ఎత్తుపల్లాల వెనుక ఉన్న ఆర్థిక ప్రయోజనాల నుంచి సామ్రాజ్యవాద విధానాల దాకా అనర్గళంగా విశ్లేషించగలిగేవారు. చదివింది పదో తరగతే.. కానీ అధ్యయనం ఆయనకు విశ్వవిద్యాలయం. రైతాంగం ఆయనకు పాఠ్యాంశం. ప్రజా జీవితం ఆయనకు ప్రయోగశాల.



గడగోజు రవీంద్రాచారి
9848772232

అంతటి జ్ఞానం ఉన్నా అందులో ఇసుమంతైనా అహంకారం కనిపించేది కాదు. తెల్లని అంగీ.. భుజాన పచ్చని తువాలు.. ముఖంపై చిరునవ్వు.. నడకలో పల్లెతనం. ఎదుటివారు ఎవరైనా ఆప్యాయంగా పలకరించడం ఆయన సహజ స్వభావం. నిస్వార్థపరుడు.. నిజాయితీపరుడు.. నిరాడంబరుడు. విమర్శించాల్సి వచ్చినా మాటలో కాఠిన్యం కంటే వివరణలో స్పష్టతకు ప్రాధాన్యం ఇచ్చేవారు. పండితులకు అర్థమయ్యే క్లిష్టమైన విషయాన్ని పామరుడికీ అర్థమయ్యే భాషలో చెప్పగలిగిన నేర్పు ఆయన సొంతం. ఎదిగే కొద్దీ ఒదిగిన మనిషి.. జ్ఞానం పెరిగే కొద్దీ మరింత సాదాసీదాగా మారిన మేధావి.

ఓంకార్ వంటి కమ్యూనిస్టు నాయకుల పరిచయం, పుచ్చలపల్లి సుందరయ్య వంటి మహానేతల ఉద్యమ స్ఫూర్తి ఆయనను కమ్యూనిస్టు భావజాలం వైపు నడిపించాయి. విద్యార్థి దశలోనే ప్రజా సమస్యల పట్ల ఆకర్షితుడై.. గ్రామంలో పార్టీ నిర్మాణానికి పూనుకున్నారు. రైతులు, కూలీలు, పేదలు, దళితుల సమస్యలపై పోరాటాల్లో భాగమయ్యారు. పోలీసుపటేల్ పదవిలో ఉన్నప్పటికీ ప్రజల పక్షాన నిలిచారు. అధికార పదవిని కాపాడుకోవడం కంటే ప్రజల హక్కుల కోసం నిలబడటానికే ప్రాధాన్యమిచ్చారు. చివరకు ఆ పదవిని వదిలి పూర్తికాలం ప్రజా ఉద్యమానికే అంకితమయ్యారు.

1973లో సీపీఎం పూర్తి కాలం కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం నర్సంపేట ప్రాంత కమిటీ నుంచి వరంగల్ జిల్లా కమిటీ, జిల్లా కార్యదర్శివర్గం, రాష్ట్ర కమిటీ, రాష్ట్ర కార్యదర్శివర్గం వరకు సాగింది. పార్టీ కంట్రోల్ కమిషన్‌లోనూ బాధ్యతలు నిర్వహించారు. పార్టీని పదవుల కోసం కాదు.. కష్టజీవుల విముక్తి కోసం పోరాట వేదికగా చూశారు. గ్రామస్థాయి పార్టీ నిర్మాణం నుంచి ప్రజాసంఘాల బలోపేతం వరకు ఆయన కృషి విస్తరించింది. నలుగురిని వెంట తీసుకెళ్లడం, కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దడం ఆయన ప్రత్యేకత.

రైతు సంఘం ఆయన జీవితానికి మరో పేరు. నర్సంపేట డివిజన్ రైతు సంఘం కార్యదర్శిగా మొదలై వరంగల్ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర రైతు సంఘం ఆఫీస్ బేరర్, అధ్యక్షుడు, కార్యదర్శి వంటి బాధ్యతలు చేపట్టారు. చివరకు అఖిల భారత కిసాన్‌సభ ఉపాధ్యక్షుడిగా జాతీయ స్థాయిలో రైతాంగ సమస్యలకు గళమెత్తారు. భూమి, సాగునీరు, పంట ధర, రుణభారం, మార్కెట్, ప్రభుత్వ విధానాలు.. రైతు జీవితాన్ని ప్రభావితం చేసే ప్రతి అంశాన్నీ అధ్యయనం చేశారు. తిమ్మంపేట సర్పంచ్‌గా, సింగిల్‌విండో అధ్యక్షుడిగా గ్రామాభివృద్ధికి కృషి చేశారు. పేదల భూముల పరిరక్షణ కోసం భూపోరాటాల్లో ముందుండారు. శ్రీరాంసాగర్ రెండో దశ వరద కాలువల కోసం వేలాది మందితో ఉద్యమాలు నిర్వహించారు.

మల్లారెడ్డి ప్రత్యేకత పోరాటం చేయడంలోనే కాదు.. పోరాటానికి శాస్త్రీయ ఆధారం చూపడంలో ఉంది. ఒక ప్రభుత్వ నివేదికలోని ఒక్క అంకె వెనుక రైతుకు కలిగే ప్రభావాన్ని గుర్తించేవారు. ఒక ప్రాజెక్టు నిర్మాణం వెనుక సాగునీటి లెక్కలనే కాదు.. ప్రాంతీయ ప్రయోజనాలు, పర్యావరణ ప్రభావాలు, ప్రజల భవిష్యత్తును కూడా పరిశీలించేవారు. వ్యవసాయ విధానాన్ని కేవలం పొలం గట్టు నుంచి కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ మార్కెట్, ప్రభుత్వ విధానాల నేపథ్యంలో చూసేవారు. అందుకే ఆయన విశ్లేషణలు నినాదాలుగా కాకుండా ఆధారాలతో కూడిన అధ్యయనాలుగా నిలిచాయి.

ఆయన కలం నుంచి వెలువడిన పుస్తకాలు ఆ మేధోప్రస్థానానికి సాక్ష్యాలు. 'రైతు ఉద్యమ చరిత్ర 1947–2007', 'బడుగు రైతుల వెతలు', 'కమిషన్లు–రికమండేషన్లు', 'కార్పొరేట్ వ్యవసాయం', 'రాష్ట్రంలో నదీజలాలు–ప్రాజెక్టులు–వినియోగం–వివాదాలు', 'తెలంగాణలో సాగునీటి వనరులు–అవకాశాలు', 'తెలంగాణ రైతాంగ భూ ఉద్యమాలు', 'వ్యవసాయ సంక్షోభంలో రైతులు దిక్కా', 'సహకార రుణాలు', 'రైతు బంధువులారా! ఆలోచించండి!!', 'రైతు సంక్షేమం–ప్రభుత్వంలో రైతు మేలెంత', 'భారత రైతాంగ పోరాటాలు' తదితర రచనలు రైతాంగ సమస్యలపై ఆయన చేసిన లోతైన అధ్యయనానికి నిదర్శనాలు. నదీజలాలు, సాగునీటి వనరులు, మైనర్ ఇరిగేషన్, కార్పొరేట్ వ్యవసాయం, ప్రపంచబ్యాంకు సంస్కరణలు, భూపోరాటాలు వంటి విభిన్న అంశాలను అక్షరబద్ధం చేశారు.

విశ్వవిద్యాలయ డిగ్రీ లేదు.. కానీ విశ్వవిద్యాలయ స్థాయి పరిశోధన ఉంది. పట్టా లేదు.. కానీ తరతరాలకు పాఠాలు చెప్పే పుస్తకాలు ఉన్నాయి. అదే సారంపల్లి ప్రత్యేకత.

వయసు పెరిగినా అధ్యయనం ఆగలేదు. 80 దాటిన తర్వాత కూడా కంప్యూటర్‌తో కుస్తీ పడుతూ కొత్త విషయాలను అన్వేషించారు. యువతతో చర్చించారు. తనకు తెలిసిన దాన్ని దాచుకోలేదు.. పంచుకున్నారు. అందుకే ఆయన దగ్గరకు వెళ్లినవారికి కేవలం సమాచారం దొరికేది కాదు.. ఆలోచించే పద్ధతి దొరికేది.



ఇప్పుడు ఆ స్వరం మౌనమైంది. రైతాంగ సమస్యపై ప్రశ్నిస్తే వెంటనే పూర్వాపరాలు చెప్పే మేధస్సు భౌతికంగా మన మధ్య లేదు. కానీ ఆయన పుస్తకాలు ఉన్నాయి. ఆయన పోరాట చరిత్ర ఉంది. ఆయన ఆలోచనలు ఉన్నాయి. ఆయన చూపిన అధ్యయన మార్గం ఉంది.

జీవితమంతా ప్రజల కోసం అంకితం చేసిన ఆయన.. మరణానంతరం కూడా తన భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనకు అందిస్తూ సమాజానికి చివరి సేవ చేశారు. జీవితాన్నే ప్రజలకు అర్పించిన నాయకుడు.. మరణాన్నీ సమాజానికే అంకితం చేసిన ఆదర్శవాది.

సారంపల్లి మల్లారెడ్డి ఒక రైతు నాయకుడిగా మాత్రమే గుర్తుండిపోరు. ఒక కమ్యూనిస్టు నాయకుడిగా మాత్రమే నిలిచిపోరు. ఒక రచయితగా మాత్రమే మిగలరు. రైతాంగాన్ని అధ్యయనం చేసిన మేధావిగా.. అధ్యయనాన్ని ఉద్యమంగా మలిచిన నాయకుడిగా.. ఉద్యమాన్ని అక్షరంగా మిగిల్చిన రచయితగా ఆయన చిరస్థాయిగా నిలుస్తారు.

చదువుకున్నది పదో తరగతి.. నేర్పినది మాత్రం తరతరాలకు. పొలం ఆయన తరగతి గది.. రైతు ఆయన పాఠ్యాంశం.. ప్రజా పోరాటం ఆయన ప్రయోగం.. అక్షరం ఆయన వారసత్వం. అందుకే సారంపల్లి మల్లారెడ్డి పేరు ఓ వ్యక్తి పేరు మాత్రమే కాదు.. రైతాంగానికి ఓ విశ్వవిద్యాలయం.

## కొవ్వు కొవ్వొత్తిలా కరగడానికి

# నాలుగు ఫుడ్స్

శరీరంలో కొవ్వు పేరుకుపోవడం వల్ల ఎన్నో అనార్థాలకు దారితీస్తుంది. ఇది పరిమితి కంటే ఎక్కువగా ఉండడంవల్ల రక్తప్రసరణలో ఇబ్బందులు ఏర్పడి గుండెపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశాలుంటాయి. అందువల్ల కొవ్వు రాకుండా లేదా వచ్చిన కొలెస్ట్రాల్ను తగ్గించుకోవడానికి ఆహారంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇలాంటి వాటిలో రెగ్యులర్ ఆహారంతోపాటు కొన్ని రకాల ప్రత్యేకమైన ఫ్రూట్స్ తినడం వల్ల కొవ్వు, కొవ్వొత్తిలా కరిగిపోతుందని కొందరు నిపుణులు పేర్కొంటున్నారు. ఆ ఫ్రూట్స్ ఏవో ఇప్పుడు చూద్దాం..

నేటి కాలంలో చాలామంది ఇంట్లో కంటే బయట ఆహారం ఎక్కువగా తింటున్నారు. వీటిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ శరీరంలో పేరుకు పోతుంది. ఇది గుండెకు సంబంధించిన ధమనుల గోడలపై పేరుకుపోవడంతో రక్తప్రసరణలో ఇబ్బందులు ఏర్పడతాయి. అయితే ఈ నాలుగు రకాల ఫ్రూట్స్ వల్ల ఈ కొవ్వు కరిగిపోయే అవకాశాలు ఉన్నాయి. అలాంటి వాటిలో..

**బెర్రీ:** మార్కెట్లో ప్రస్తుతం స్ట్రాబెర్రీలు విరివిగా లభిస్తున్నాయి. వీటి ద్వారా కాస్త ఎక్కువగా ఉన్న అప్పుడప్పుడు వీటిని తినడం వల్ల అనేక రకాల ప్రయోజనాలు ఉంటాయి. మిగతా పండ్ల కంటే కాస్త రుచి తక్కువగా ఉన్నా కూడా.. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ బెర్రీలో ఫైబర్ అధికంగా ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యంగా ఉండడానికి ఎంతో మేలు చేస్తాయి. అందువల్ల మార్కెట్ కు వెళ్ళినప్పుడు వీటిని అదనంగా తీసుకునే ప్రయత్నం చేయండి.



**అవకాడో:** ఈ రకమైన ఫ్రూట్ కొన్ని మార్కెట్లో లభించినప్పటికీ.. వీటిని కూడా సందర్భాన్ని బట్టి తీసుకోవడం చాలా అవసరం అని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. అవకాడో కొలెస్ట్రాల్ను తగ్గించడానికి ఎక్కువగా సహాయం చేస్తుంది. అయితే కేవలం అవకాడో తినడానికి ఇబ్బందులు ఏర్పడితే వీటిని సలాడ్లో చేర్చుకోవడం వల్ల కూడా ప్రయోజనాలు ఉండే అవకాశం ఉంటుంది.

**కివి:** మన భారతీయ మార్కెట్లో కివి ఇప్పుడు ప్రతి మార్కెట్లో అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా కొలెస్ట్రాలను అధికంగా తగ్గించుకుని ప్రయత్నం చేయవచ్చు. దీనిని కూడా నేరుగా తినడానికి ఇబ్బంది పడితే సలాడ్లో చేర్చుకోవచ్చు. వీటి ధర అధికంగా ఉన్నప్పటికీ సందర్భాన్ని బట్టి తీసుకోవాలని కొందరు చెబుతున్నారు.

**ఓట్స్:** కేవలం పనులు మాత్రమే కాకుండా ఓట్స్ వంటి ఆహారం తీసుకోవడం వల్ల కూడా చెడు కొలెస్ట్రాలను తగ్గించుకునే అవకాశం ఉంటుంది. ప్రతిరోజు దీనిని బ్రేక్ ఫాస్ట్ గా తీసుకుంటే రోజంతా యాక్టివ్ గా ఉండడంతో పాటు చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా చూస్తుంది.

ఈ విధంగా చెడు కొలెస్ట్రాల్ తో బాధపడేవారు రోజు తినే ఆహారంతో పాటు ఇలాంటి ప్రత్యేకమైన పూర్తి తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే కొన్ని రకాల పండ్లు వైద్యుల సలహా మేరకు తీసుకోవడం మంచిది.



మీరు రోజు కూరగాయలు తింటారా? మరి తినాల్సిందే కదా. రోజు వంట చేయాల్సిందే కదా. రోజు రెండు సార్లు వంట చేస్తారా? రైస్ చేయకున్నా చపాతీలోకి కూడా కర్రీ ఉండాలి. అంటే కూరలు వండాలి. మరి ఆకుకూరలా? కూరగాయలా? అయితే ఆకుకూరలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అందువల్ల, అందరూ తమ ఆహారంలో ఆకుకూరలను చేర్చుకోవాలి. అయితే ప్రతి రోజు కూరగాయలు తింటారు చాలా మంది. వారంలో ఒకసారి లేదా అప్పుడప్పుడు మాత్రమే ఆకుకూరలను వండుతారు. ఏ సీజన్ లో అయినా సరే వీటిని తినవచ్చు. అంటే ప్రతి సీజన్‌లో ఆకుకూరలు తినాలి. ఇక శీతాకాలంలో ఆకుకూరలు సులభంగా లభిస్తాయి. శీతాకాలంలో వాటిని తీసుకోవడం కూడా ప్రయోజనకరం. ఇప్పుడు వర్షాకాలం కదా.

# ఆకు కూరలతో మేలు

ఆకుకూరలు తినడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. శరీరం అనేక వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. మీరు మీ శీతాకాలపు ఆహారంలో ఆకుకూరలను కూడా చేర్చుకోవాలి. ఎందుకంటే ఇందులో కాల్షియం, ఐరన్ ఉంటాయి. ఇవి కూరగాయల్లో లభించేకంటే మూడు నుంచి 4 రెట్లు ఎక్కువగా ఆకుకూరల్లో లభి స్తాయి. అంతేకాదు శరీరానికి కావాల్సిన లవణాలు కూడా ఈ ఆకు కూరల్లో లభిస్తాయి. సోడియం, పొటాషియం, మెగ్నీషియం కూడా పుష్కలంగా లభిస్తాయి. కూరగాయల్లో కంటే ఇవి ఆకుకూరల్లోనే 3 నుంచి నాలుగు రెట్లు ఎక్కువ ఉంటాయి.

ఇందులో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువే ఉంటాయి. అంతేకాదు నూనె, మసాలా వంటివి కూడా ఈ ఆకుకూరల వల్ల సేవ్ అవుతాయి. ఈ ఆకుకూరలకు మసాలా, నూనె వంటివి చాలా తక్కువ అవసరం. ఇందులో మసాలా అసలు వేయరు. సో ఈ ఆకుకూరలకు మాసాలా పెట్టాలనే ఆలోచన కూడా ఉండదు. కొన్ని ఆకుకూరల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, రాగి, మాంగనీస్, కాల్షియం వంటివి పుష్కలంగా లభిస్తాయి. మీరు అలాంటివి తింటే జీర్ణక్రియకు సంబంధించిన సమస్యలను తొలగించుకోవచ్చు. కాల్షియం, మెగ్నీషియంలు ఎముకలను బలంగా చేస్తాయి. వీటి వల్ల కీళ్ల నొప్పుల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 26.08.2026
www.mudranews.in | @mudranews



## తలనొప్పి, మైగ్రేన్ : ఒత్తిడిని తగ్గించండి

స్ట్రెస్ మైగ్రేన్‌కు ఒక సాధారణ ట్రిగ్గర్. లోతైన శ్వాస, రిలాక్సేషన్ వ్యాయామాలు, నడక లేదా క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఒత్తిడిని నియంత్రించేందుకు ప్రయత్నించండి.



## బిల్డింగ్ ట్రిబ్యునల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి

**ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి**



**ముద్ర, హైదరాబాద్:** మున్సిపాలిటీల్లో అనధికార నిర్మాణాలను నియంత్రించడం తో పాటు టౌన్ ప్లానింగ్, ఎన్ ఫోర్స్ మెంట్, భవన సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు బిల్డింగ్ ట్రిబ్యునల్ ను వెంటనే పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఫోరం అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. అనధికార నిర్మాణాలు ప్రణాళికాబద్ధమైన పట్టణ అభివృద్ధిని దెబ్బతీయడంతో పాటు ప్రజలకు అనేక సమస్యలు, ప్రమాదాలను సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునే సమయంలో బిల్డర్లు కోర్టులను ఆశ్రయించి స్టేలు పొందుతున్నారని, దీంతో భవన నిర్మాణ, అగ్నిమాపక భద్రతా నిబంధనల ఉల్లంఘనలు కొనసాగుతున్నాయని తెలిపారు.భవనాలకు సంబంధించిన కేసులను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం 2016లో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసినప్పటికీ, ఇప్పటివరకు చైర్ పర్సన్, సభ్యులను నియమించకపోవడం వల్ల అది పనిచేయడం లేదని లేఖలో పేర్కొన్నారు.ట్రిబ్యునల్ కు చైర్ పర్సన్, సభ్యులను నియమించాలని కోరుతూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ దాఖలు చేసిన PIL No.113/2019పై తెలంగాణ హైకోర్టు 2022 ఏప్రిల్ 27న విచారణ జరిపి, నాలుగు వారాల్లో ట్రిబ్యునల్ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరమన్నారు.గత పదేళ్లుగా ఈ అంశం పెండింగ్ లో ఉందని పేర్కొన్న పద్మనాభరెడ్డి, హైకోర్టు ఆదేశాలను అమలు చేసి బిల్డింగ్ ట్రిబ్యునల్ కు చైర్ పర్సన్, సభ్యులను అత్యవసరంగా నియమించి, ట్రిబ్యునల్ ను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

## రేవంత్ విదేశీ పర్యటనపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నలు



**ముద్ర, హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సంబంధించి రాజకీయ కుట్ర అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. అమెరికా పర్యటనకు పొలిటికల్ క్లియరెన్స్ ఎందుకు రాలేదో ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. పొలిటికల్ క్లియరెన్స్ అంటే రాజకీయ అనుమతి కాదని, విదేశాంగ శాఖ నుంచి పొందాల్సిన అధికారిక అనుమతేనని తెలిపారు. అమెరికా పర్యటన కోసం సీఎం ఐదు రోజుల ముందే దరఖాస్తు చేసుకున్నారని, ఇంగ్లండ్‌కు అనుమతి వచ్చినా అమెరికాకు రాలేదని పేర్కొన్నారు. విదేశీ పర్యటనలో ఎవరిని కలవాలి, ఎందుకు కలవాలి, ఏ ప్రయోజనాల కోసం వెళ్తున్నారనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. ఫ్యూచర్ సిటీ పేరుతో విదేశీ యూనివర్సిటీలను తీసుకొస్తామనే హామీలపై కూడా ప్రభుత్వం వాస్తవాలు వెల్లడించాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

## వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి: మంత్రి సీతక్క

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు నిర్దేశించిన 6.18 కోట్ల మొక్కల లక్ష్యంలో 5.32 కోట్ల మొక్కలు (86 శాతం) నాటినట్లు తెలిపారు. నాటిన ప్రతి మొక్క వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడంతో పాటు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని, అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్‌ను పటిష్టం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని, పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి సమీప ప్రాంతంలోనే పని అందించాలని సూచించారు. ఫార్మ్ పాండ్లు, చెక్‌డ్యామ్‌లు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగవంతం చేసి శాశ్వత ఆస్తులుగా అభివృద్ధి చేయాలని తెలిపారు. తక్కువ పనితీరు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఉపాధి, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల సృష్టిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

## డే విత్ లైబ్రరీ విజేతలకు నగదు పురస్కారం ప్రదానం



**ముద్ర,మోత్కూరు:** మోత్కూరు శాఖ గ్రంధాలయం వేసవి సెలవులు మే 11 నుండి జూన్ 11 వరకు నెల రోజులపాటు నిర్వహించిన 'డే విత్ లైబ్రరీ' కార్యక్రమంలో పాల్గొని, పుస్తక పఠనం చేసిన విద్యార్థులకు మంగళవారం ఒక్కొక్కరికి 2500 నగదు, మేమెంటోను అందజేశారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీ నరసింహ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పాఠశాల విద్యార్థులు సెల్‌ఫోన్ కు బానిసలు కాకుండా, వేసవిలో తమ విలువైన సమయాన్ని వృధా చేయకుండా గ్రంథాలయాల బాట పట్టించేందుకు వినూత్నంగా చేపట్టిన డే విత్ లైబ్రరీ కార్యక్రమం అభినందించడం జరిగినది అన్నారు. పాఠశాల స్థాయి నుడే విద్యార్థులను గ్రంథాలయాల బాట పట్టించి పుస్తక పఠనం అలవాటు చేయించడం అభినందించదగ్గ విషయం అన్నారు.గ్రంథాలయంలో ఉన్న విలువైన పుస్తకాలను చదవడం ద్వారా విషయ పరిజ్ఞానంతో పాటు మానసిక వికాసం పెంపొందుతుం దన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న తల్లిదండ్రులు పల్లెర్ల సరస్వతి రంగయ్యలా జ్ఞాపకార్థం నలుగురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయానికి తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. గ్రంథాలయ చైర్మన్ కోమటి మత్స్య గిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సూరోజు భాస్కరాచారి, మోత్కూరు విజయలక్ష్మి ట్రస్ట్ మెమోరియల్ చైర్మన్ మోత్కూరి బ్రహ్మాచారి అమెరికా నుండి సందేశాన్ని అందించారు.అనంతుడు ఫౌండేషన్ చైర్మన్ మోత్కూరి శ్రీనివాస్, పుట్ట దయాకర్, నాగలి సంధ్య సైదులు విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలను అందించారు.మహమ్మద్ అలీ తన తమ్ముడు జానీ జాపకార్థం మేమేంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కురిమిళ్ల ప్రమీల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు దేవినేని అరవిందరాయుడు, సీనియర్ పాత్రికేయులు ఎస్ఎన్ చారి, గ్రంథాలయ వైస్ చైర్మన్ పోచం బిక్షపతి, డైరెక్టర్ చేకూరి బిక్షం, రేణిగుంట ప్రణతి, మహమ్మద్ రఫీ, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మర్రి ఆనందం, బయ్యని రాజు, ఉయ్యాలా అంజయ్య, లైబ్రరీ ఇంచార్జ్ చిలకమర్రి బాబు చారి,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సన్మానించారు.

# దేశంలోని కోటి కుటుంబాలకు సౌర విద్యుత్తు

**ప్రపంచంలోనే అతిపెద్ద రూఫ్ టాప్ సోలార్ సిస్టం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి**
**పోస్టర్ ఆవిష్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్**






**ముద్ర, కరీంనగర్ :** పేదలపై విద్యుత్ భారాన్ని తగ్గించడం, తద్వారా కర్బన ఉద్గారాలు,వాతావరణ కాలుష్యాన్ని నివారించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని తీసుకువచ్చిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

**జైవిక్ కంపెనీ భాగస్వామ్యంలో**

తెలంగాణలో ఈ పథకాన్ని అమలు చేయడానికి మారుతి ఏజెన్సీస్ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. మారుతి ఏజెన్సీస్ నిర్వాహకుడు తిప్పారపు ఆంజనేయులు, ఆ సంస్థ ప్రతినిధులు దేవోజు వెంకటరమణాచారి,తిప్పారపు రవివర్మ లతో కలసి ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం పోస్టర్లను మంగళవారం ఇక్కడ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2027 మార్చి నాటికి దేశంలోని కోటి కుటుంబాలకు సౌర విద్యుత్ అందించే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తున్నదని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద రూఫ్ టాప్ సోలార్ స్కీమ్ గా ఆయన అభివర్ణించారు.ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి సగటున రూ.77,800 సహాయం అందుతుందన్నారు. ఒక కిలో వాట్ వరకు రూ.30,000, రెండు కిలోవాట్లకు రూ. 60000, మూడు కిలోవాట్లకు 78 వేల సబ్సిడీ లబ్ధిదారులకు లభిస్తుందన్నారు.

ఈ పథకం ద్వారా తమ గృహాలకు అవసరమైన విద్యుత్తును వాడుకొని మిగిలిన విద్యుత్తును లబ్ధిదారులు డిస్కంలకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని సూచించారు. ఈ పథకానికి సంబంధించిన వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన మారుతి ఏజెన్సీస్ నిర్వాహకులను కోరారు.

## మూసీ ప్రాజెక్టు భూసేకరణను వేగవంతం చేయాలి

**- సీఎం రేవంత్ రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్:** మూసీ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈ.వి. నరసింహారెడ్డి, జేఎండీ గౌతమి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టు కోసం చేపట్టే భూసేకరణలో ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సీఎం సూచించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా అన్ని అంశాలను పరిశీలించి ముందుకు వెళ్లాలని సూచించారు.మూసీ ప్రాజెక్టు ఫేజ్–2కు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల కోసం తక్కువ వడ్డీకి లభించే రుణాలపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. టీడీఆర్ (TDR) అంశంపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.అదేవిధంగా మంచిరేవులలోని ఓంకారేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన టెండర్లను తక్షణమే పిలవాలని సీఎం సూచించారు. కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించి సందర్శకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## అంజయ్యనగర్‌లో కొనసాగుతున్న కూల్చివేతలు

**ముద్ర, హైదరాబాద్:** గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు మంగళవారం కూడా కొనసాగుతున్నాయి. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైడ్రా అధికారులు సంయుక్తంగా ఈ అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నారు. ఇప్పటికే రెండు భవనాలను నేలమట్టం చేయగా.. మరో ఆరు అంతస్తుల భవనాన్ని కూల్చివేస్తున్నారు. గచ్చిబౌలి పరిధి అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం శనివారం కూలిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ నేపథ్యంలో అక్రమ, పాక్షికంగా దెబ్బతిన్న నిర్మాణాలపై అధికారులు దృష్టిసారించారు.

## శ్రీశైలంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య

**ముద్ర, శ్రీశైలం :** శ్రీశైలంలోని వడ్డెర సత్రం రూమ్ నెం.11లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన పల్లపు సుధాకర్ (50), గోగుల ఆదిలక్ష్మి (36), మల్లేశ్వరి (45), శ్రీదేవి (33), మణికంఠ (15)గా పోలీసులు గుర్తించారు. ఇద్దరు పురుషులు ఫ్యాన్‌కు, ముగ్గురు మహిళలు కబోర్డు, బాత్రూం డోర్లకు ఉరేసుకుని చనిపోయారు. ఈ ఘటన మూడు రోజుల కిందట జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

**ఆర్థిక ఇబ్బందులే కారణం: డీఎస్పీ**

మృతులు గత నెల 28న ఆటోలో శ్రీశైలానికి వచ్చి, రోజుకు రూ.800 అద్దెతో వడ్డెర సత్రంలో ఉంటున్నారని డీఎస్పీ తెలిపారు. సుధాకర్‌కు పెళ్లి కాలేదని, ఇద్దరు చెల్లెళ్లు భర్తలను వదిలి ఇంట్లోనే ఉంటున్నారని చెప్పారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల వల్లే ఈ ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు

## కాజీపేట నూతన బస్‌స్టాండ్‌కు భూమి మార్పిడి ప్రక్రియ వేగవంతం చేయాలి

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**



**ముద్ర, వరంగల్ :** కాజీపేట నూతన బస్‌స్టాండ్ నిర్మాణానికి అవసరమైన భూమి మార్పిడి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిగారిని కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కాజీపేట సిగ్నల్ జంక్షన్ వద్ద దక్షిణ మధ్య రైల్వేకు చెందిన భూమిని రాష్ట్ర ప్రభుత్వ భూమితో సమాన భూ విలువ ప్రాతిపదికన మార్పిడి చేసేందుకు రైల్వే ప్రతిపాదించిన విషయాన్ని మంత్రి దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. ఈ మేరకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి, రైల్వేతో ప్రతిపాదిత భూముల మార్పిడికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని కోరారు. ప్రభుత్వ భూమి లభ్యత, అనుకూలతను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు.

కాజీపేట నూతన బస్‌స్టాండ్ నిర్మాణం పూర్తయితే కాజీపేటతో పాటు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం రైల్వే, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో భూమి మార్పిడి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, నిర్మాణ పనులకు మార్గం సుగమం చేయాలని కోరారు.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాజీపేట నూతన బస్‌స్టాండ్ నిర్మాణ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిగారిని ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

## ఎంఎస్ఎస్ఆర్ఎఫ్‌కు డాక్టర్ వైఎస్సార్ అవార్డు



**ముద్ర, హైదరాబాద్ :** వ్యవసాయం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో విశేష సేవలం దించిన ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎంఎస్ఎ స్ఆర్ఎఫ్) కు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అవార్డు–2026ను డాక్టర్ వైఎస్సార్–డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ ప్రకటించింది. ఈ అవార్డు కింద రూ.25 లక్షల నగదు బహుమతిని అందజేయనున్నారు. సెప్టెంబర్ 2న న్యూఢిల్లీ లోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగే కార్యక్రమంలో ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ అవార్డును స్వీకరించనున్నారు.

దివంగత డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ శాస్త్రీయ నాయకత్వం దేశ హరిత విప్లవానికి, ఆహార కొరత నుంచి ఆహార స్వయం సమృద్ధి దిశగా భారత్‌ను నడిపించడంలో కీలక పాత్ర పోషించింది. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ సుస్థిర వ్యవసాయం, ఆహార–పోషకాహార భద్రత, జీవవైవిధ్యం, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో రైతులు, గ్రామీణ ప్రజలకు విజ్ఞాన ఫలాలను చేరవేస్తోంది.

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, సమగ్ర అభివృద్ధి ఆశయాలను కొనసాగించేందుకు డాక్టర్ వైఎస్సార్–డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ ఏర్పాటైంది. వ్యవసాయం, నీటిపారుదల, వైద్యం, విద్య తదితర రంగాల్లో సేవలందిస్తున్న వ్యక్తులు, సంస్థలను సత్కరించడంతో పాటు ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం ఫౌండేషన్ లక్ష్యాల్లో భాగంగా ఉంది.2025లో ఫౌండేషన్ తొలి అవార్డును సుస్థిర, ప్రకృతి వ్యవసాయంలో విశేష కృషి చేసిన 'సుభాష్ పాలేకర్ కృషి'కి అందించింది. 2026లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రూ.21 లక్షల స్కాలర్‌షిప్ కార్పస్‌ను ఏర్పాటు చేసింది.

డాక్టర్ వైఎస్సార్ అవార్డు–2026 ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ వారసత్వాన్ని, రైతులు–పేదల సంక్షేమం కోసం డాక్టర్ వైఎస్సార్ చేసిన సేవలను ఒకే వేదికపై స్మరించుకుంటున్నామని ఫౌండేషన్ పేర్కొంది. ఫౌండేషన్ ట్రస్టీలుగా డాక్టర్ కేవీపీ రామచందర్ రావు, డాక్టర్ జి. చిన్నారెడ్డి, డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి వ్యవహరిస్తున్నారు.

## రూ.840 కోట్లతో 365 బీబీ హైవే అభివృద్ధి: గడ్కరీ

**ముద్ర, అమరావతి :** తెలుగు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి 365బీబీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుట్టాయగూడెం-ఎల్ఎన్‌డీ పేట, పట్టిసీమ- కొవ్వూరు సెక్షన్ల మధ్య 45.09 కిలోమీటర్లతో రహదారి ఉన్నతీకరణ కోసం రూ.840.41 కోట్లతో కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా వెల్లడించారు.45 కిలోమీటర్ల 2 లేన్ల జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్లు నిర్మించనున్నట్లు గడ్కరీ తెలిపారు. ఈ రహదారి ఉన్నతీకరణతో పోలవరం ప్రాజెక్ట్, పరిసర గ్రామాలకు కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతం పొగాకు, చెరకు, ఫామాయిల్ తోటలతో నిండి ఉంటుందని.. ఈ హైవే అభివృద్ధితో మౌలిక సదుపాయాలు మెరుగుపుతాయన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 26.08.2026
www.mudranews.in | @mudranews



**తలనొప్పి , మైగ్రేన్ :** నిద్ర సమయాన్ని క్రమబద్ధీకరించాలినిద్ర సరిగా లేకపోవడం మైగ్రేన్‌ను ప్రేరేపించవచ్చు. ప్రతిరోజా దాదాపు ఒకే సమయానికి నిద్రపోవడం, మేల్కొనడం వంటి క్రమబద్ధమైన నిద్ర అలవాటు ఉపయోగకరంగా ఉంటుంది.



# పర్యావరణ పరిరక్షణలోనే మానవాళి మనుగడ

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం , ఆగస్టు 25 :** వెలుగుమట్ల అర్బన్ పార్కులో వైభవంగా నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం ప్రాముఖ్యతపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. మానవుడు తన స్వార్థం కోసం అడవులను నాశనం చేయడం వల్లే తీవ్ర పర్యావరణ విధ్వంసం జరుగుతోందని, దాని ఫలితంగానే ఎల్ నినో వంటి మహమ్మారి పరిణామాలు సంభవిస్తున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది మైదాన ప్రాంతాల్లో సరైన వర్షాలు కురవలేదని, కానీ ఎగువన ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అటవీ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగానే గోదావరి నదికి వరదలు వచ్చాయని వివరించారు. ఇదే సమయంలో ఎల్ నినో ప్రభావంతో మున్నేరుకు వరద రాకపోవడమే కాకుండా, ఎగువన ఉన్న బయ్యారం చెరువు కూడా అలుగు పారలేదని గుర్తుచేశారు.రాబోయే రెండు నెలల కాలం తాగునీటి దృష్ట్యా ఎంతో గడ్డు కాలమని స్పష్టం చేసిన మంత్రి, ఖమ్మం నగరవాసులకు ఎలాంటి నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ట్యాంకర్లతో నీటి సరఫరా చేసే పరిస్థితి రాకుండా నగరంలో నిరంతరం తాగునీరు అందేలా పక్కాగా చర్యలు తీసుకుంటున్నామని ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో సరైన వర్షాలు కురవాలంటే అడవుల విస్తీర్ణాన్ని పెంచడం ఒక్కటే మార్గమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సంపాదించే కోట్లాది రూపాయల ఆస్తి మనకు ఆరోగ్యాన్ని ఇవ్వలేదని, పర్యావరణం బాగున్నప్పుడే మానవ ఆరోగ్యం సంతోషంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.వన మహోత్సవాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక పెద్ద ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని, భావి తరాలకు మంచి భవిష్యత్తును అందించేలా పౌర సమాజం బాధ్యతగా పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఖమ్మం నగరం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, పచ్చదనంతో శోభిల్లాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలోనే నిర్మించిన స్తంభాద్రి ప్రకృతి వనం రాష్ట్రానికే ఒక ఆదర్శవంతమైన నమూనాగా నిలవాలని దిశా నిర్దేశం చేశారు. ఖమ్మం నగర ప్రజలు, కుటుంబ సమేతంగా వచ్చి ఆహ్లాదకరంగా గడిపేందుకు ఈ పార్కును ప్రత్యేకంగా తీర్చిదిద్దామని, ముఖ్యంగా పిల్లలు ఎంతో సంతోషంగా సమయాన్ని గడిపేలా పార్కులో అన్ని రకాల ఆధునిక వసతులు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# నేత్రదానం మహత్తర సామాజిక సేవ

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**ముద్ర, సూర్యాపేట, ఆగస్టు 25:** నేత్రాలను దానం చేసే వారిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేత్రదానం ఒక మహత్తరమైన సామాజిక సేవ అని, ఒక వ్యక్తి మరణానంతరం దానం చేసే నేత్రాలతో ఇద్దరు అంధులకు చూపు కల్పించే అవకాశం ఉందన్నారు. ప్రజలు నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించుకుని, కుటుంబ సభ్యులకు దాని ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. పుట్టిన శిశువు నుంచి అన్ని వయసుల వారికి నేత్ర రుగ్మతలను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి సూచించారు.పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించాలని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కంటి శస్త్రచికిత్సల కోసం 90 రోజుల్లో ఆపరేషన్ థియేటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. మెడికల్ కళాశాల లైబ్రరీ నిర్వహణకు గతంలో విడుదలైన రూ.30 లక్షల నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు రూ.50 వేల నిధులను మంజూరు చేశారు."మీ కళ్లను మరణానంతరం మట్టిలో కలపకుండా, మరొకరి జీవితంలో వెలుగుగా మార్చండి – నేత్రదానం చేయండి" అని కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు.ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నేత్రదానంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. పెండెం వెంకట రమణ తెలిపారు. ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాలలు, వైద్య కళాశాలలు, ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నేత్రదానం ప్రాధాన్యతను వివరించనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో భాగంగా నర్సింగ్ కళాశాల నుంచి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొని "నేత్రదానం చేయండి – మరొకరికి చూపును ప్రసాదించండి" అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా. శ్రవణ్ కుమార్, కంటి వైద్యులు డా. ఎస్. రమేశ్ కుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె. వెంకట రమణ, ప్రోగ్రాం అధికారి డా. జి. చంద్రశేఖర్, డా. నాజియా తబస్సుం, డా. శ్రీశైలం, డా. వాసవి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా వనమహోత్సవ కార్యక్రమం







**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మండలంలోని తాజ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. వనమహోత్సవం సందర్భంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అవి పెద్ద చెట్లుగా ఎదిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, పాఠశాలలు, రహదారుల వెంట, చెరువుల పరిసరాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, పశువుల నుంచి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలందరూ వనమహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములను చేసి, ప్రతి ఇంట్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంతో పాటు గ్రామాల పరిసరాలు ఆహ్లాదకరంగా మారుతాయని పేర్కొన్నారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను సిబ్బంది తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్ రెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, తాజ్పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### మోత్కూర్‌లో ..

**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మున్సిపాలిటీ పరిధి 11వ వార్డులో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కమిషనర్ అధికారులు, సిబ్బంది పాల్గొని మొక్కలు నాటి వాటికి నీరు పోశారు.ఈ సందర్భంగా ఆ ఏరియా కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న గౌడ్, మెంట రమణ నగేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని క్రమం తప్పకుండా సంరక్షించినప్పుడే వన మహోత్సవం కార్యక్రమం లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. పట్టణంలో పచ్చదనం పెరిగేలా ప్రజలు కూడా విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమా నర్సయ్య, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్లు బీసు శ్రీకాంత్ గౌడ్, మొగుళ్ల అనురాధ, కొండ శోభ సోమ్ మల్లు,నల్ల మధు,కూర్మిళ్ల ప్రమీల రాములు, సుల్తాన్ స్వామి, కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వార్డ్ ఆఫీసర్స్ సంధ్య రాణి, సుప్రియ, కిరణ్, మహేష్, నిఖిల్, యాదయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ముద్ర, మోత్కూర్ :** పనకబండ గ్రామంలో పర్యా పరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యకమం నిర్వహించారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించి ఆరోగ్య కరమైన వాతాపరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిం చాలని సర్పంచ్ లోతకుంట రేణుక సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాధారపు మల్లేష్, గ్రామ కార్యదర్శి కేతావతి, అలివేలు ఫీల్డ్ అసిస్టెంట్ రాంపాక రవి ,కారిపోతుల మంజుల, బత్తిని పద్మ, మహేశ్వరం మంగమ్మ, సుధాగాని శోభ, బత్తిని వెంకటయ్య, సుధాగాని రఘు, లోతకుంట స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ముట్టడికి రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 25 :** పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సంఘం నాయకులు కోరారు. ఖమ్మం పెన్షనర్స్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన ఉద్యమ సన్నాహక సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డి. వెంకటేశ్వర్లు, వై. వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల పట్ల పక్షపాత వైఖరిని అవలంబిస్తూ హామీలతో కాలయాపన చేస్తోందని వారు విమర్శించారు. గత మూడు నెలలుగా 1.5 శాతం జీతాన్ని మినహాయించుకున్నప్పటికీ ఇప్పటివరకు హెల్త్ కార్డులు జారీ చేయలేదని, అలాగే తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఆరు డిఏ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పే రివిజన్ కమిషన్ నివేదికను ప్రకటించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని మండిపడ్డారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల కలెక్టరేట్ల వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో రిటైర్ ఉద్యోగులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని కలెక్టరేట్‌ను దిగ్బంధించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వి. శ్రీనివాసరావు, ఎస్. పూర్ణచంద్రరావు, జనార్దన్, కాజా మొయినుద్దీన్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాసురాబాదు–అనాజిపురం లింక్ రోడ్డు మంజూరు చేయాలని మంత్రి సీతక్కకు వినతి



**ముద్ర, సూర్యాపేట:** పటేల్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో మీ కృష్ణ కమల్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి కాసురాబాదు నుంచి అనాజిపురం వరకు లింక్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించింది.ఈ సందర్భంగా కాసురాబాదు–అనాజిపురం లింక్ రోడ్డు నిర్మాణంతో ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, విద్య, వైద్యం, వ్యవసాయ అవసరాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రహదారి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుని త్వరగా మంజూరు చేయాలని వారు కోరారు.

## ఫీజు బకాయి బీజేపీ లడాయి దీక్షకు సంఘీభావ ధర్నా



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బిజెపి అధ్యక్షులు రామచంద్ర రావు తలపెట్టిన ఫీజు బకాయి బిజెపి లడాయి రెండు రోజుల దీక్షకు సంఘీభావంగా భువనగిరి పట్టణంలో పట్టణ శాఖ అధ్యక్షులు రత్నపురం బలరాం ఆధ్వర్యంలో మంగళవారం వినాయక చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ వెంటనే ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదల చేయాలని లేని పక్షంలో బిజెపి యువమోర్చా ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయ దశరథ, జిల్లా ఉపాధ్యక్షులు జాయినపల్లి శ్యాంసుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, సర్వే శ్రీనివాస్ గౌడ్, కోళ్ల బిక్షపతి, మంగు నరసింహారావు, ఎండి మహమూద్, కౌన్సిలర్లు వంగేటి సుచరిత, బండారు సుచరిత, తుమ్మల యాస్మిన్, బెజ్జంకి రామకృష్ణారెడ్డి, కొల్లోజు శ్రవణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కృష్ణచారి, కొలిచెలిమి మల్లికార్జున్, నాగరాజు మామిడోజి పవన్, బాల శంకర్, గాయపాక పృధ్వి, పట్నం దిలీప్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు వెంకటేష్, కానుకుంట్ల రమేష్, ఎదగాని సంతోష్, కోళ్ల సుధాకర్, జెర్రిపోతుల భరత్, భువనగిరి శ్యామ్ పాల్గొన్నారు.

## హెచ్ఐవి పై అవగాహనకై బైక్ ర్యాలీ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లాలో ఇంటెన్సిఫైడ్ ఐఈసి కాంపెయిన్ లో భాగంగా హెచ్ఐవి పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి సంక్రమణ, నివారణ, పరీక్షలు, చికిత్స అందుబాటులో ఉన్న సంబంధిత ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సెల్ఫ్ హెచ్ఐవి రిస్క్ అసెస్మెంట్ కోసం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ పోస్టర్లను ప్రజలకు పరిచయం చేశారు. డి ఐ సి సంపతయ్య, డాక్టర్ హరీష్, డాక్టర్ ప్రణీషా, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## గుమ్మడవల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల పరిధిలో గల గుమ్మడవల్లి గ్రామంలో మంగళవారం కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులతో పాటు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అనంతరం గ్రామంలో సర్పంచ్ ఆదిరాల సుమలత రమేష్, ఉప సర్పంచ్ బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ వర్కాల సత్యనారాయణ, గ్రామపంచాయతీ సిబ్బందితో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తీజ్ ఉత్సవానికి రూ.30వేల విరాళం



**ముద్ర, దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని రామ్ రామ్ బంజారా సంఘం ఆధ్వర్యంలో స్థానిక టిటిడి కళ్యాణ మండపం వద్ద నిర్వహిస్తున్న తీజ్ ఉత్సవ వేడుకకి 30,000 వేల రూపాయల విరాళం ఉత్సవ కమిటీ సభ్యులకి అందజేసిన బియర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్. వారివెంట కేతావత్ హరిలాల్ నాయక్ ,నేనావత్ నాగార్జున నాయక్ రామ్ రామ్ బంజారా సంఘం కమిటీ సభ్యులు రమావత్ వంశీ , దినేష్ , సీతారాం, రమేష్ , చందు నాయక్, శశి, రవి, తిరుపతి, రాజు తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి బియ్యం పంపిణీ



**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో కాశవాడలో ఇటీవల మరణించిన షేక్ మధార్ కుటుంబాన్ని10వ వార్డ్ కౌన్సిలర్ నల్ల మధు యాదవ్ పరామర్శించి ఆ కుటుంబానికి మునుముందు ప్రభుత్వం నుండి సహాయం చేస్తామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మధు యాదవ్ ఆ కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు .ఈ కార్యక్రమంలో చేతరాశి వెంకన్న, వర్రె రాములు ,నల్ల మహేష్, జటంగి పరుశరాములు, అశోక్, దాదే సాబ్, బడే సాబ్,పక్కీరు, మదార్, అక్బర్, మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 26.08.2026
www.mudranews.in | @mudranews



**తలనొప్పి , మైగ్రేన్ :**



చీకటి, ప్రశాంతమైన గదిలో విశ్రాంతి మైగ్రేన్ సమయంలో వెలుతురు, శబ్దం నొప్పిని మరింత పెంచవచ్చు. అందుకే లైట్లు తగ్గించి, ప్రశాంతమైన చీకటి గదిలో కాసేపు విశ్రాంతి తీసుకోవడం ఉపశమనానికి సహాయపడుతుంది.

# ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి వడివడిగా అడుగులు

**15 నియోజకవర్గాల్లో టెండర్ ప్రక్రియ పూర్తి**
**అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలో ఈ నెల 27 నుంచి 30 వరకు పారదర్శకంగా లక్కీ డ్రా**
**మరో 4 నియోజకవర్గాల్లో దరఖాస్తులకు ఆహ్వానం**
**సెప్టెంబర్ 3 వరకు దరఖాస్తుల స్వీకరణ**
**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్ మహా నగరంలోని క్యూర్ పరిధిలో సొంతింటి కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న నిరుపేద కుటుంబాల కలలను నిజం చేసే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు ముందుకు వేసిందని పేదవాడికి కూడా నగరంలో సొంత ఇల్లు ఉండాలని, ఆత్మ గౌరవంతో జీవించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి గారి నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. . మంగళవారం సచివాలయంలో హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, లక్కీ డ్రా నిర్వహణ, కొత్త నియోజకవర్గాల్లో దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియను పూర్తిచేశామని వెల్లడించారు. క్యూఆర్ పరిధిలోని తొలి విడతలో ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో 807.40 కోట్ల అంచనా వ్యయంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని ఇందుకోసం జూన్ 20 నుంచి ఆగస్టు 15 తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించగా మొత్తం 60,720 దరఖాస్తులు అందాయని, వచ్చిన .దరఖాస్తులపై 360 డిగ్రీల క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర విచారణ అనంతరం 40,900 మందిని అర్హులుగా, 19,820 మందిని అనర్హులుగా గుర్తించామన్నారు. అనర్హతకు గల కారణాలను దరఖాస్తుల వారీగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు మంత్రి గారు తెలిపారు. ఈ నెల 27, 28, 29, 30 తేదీల్లో ఆయా ప్రాంతాల్లోని ప్రత్యేక ఫంక్షన్ హాళ్లలో ప్రజలు, అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలోనే పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహిస్తామని ప్రతి కేంద్రానికి ఒక ప్రత్యేక పర్యవేక్షణాధికారిని కూడా నియమించామని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల తుది జాబితా ప్రకటించిన తర్వాత ఎంపిక కాని దరఖాస్తుదారులకు వారు చెల్లించిన రూ. 10,000 ఈఎండీ మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లోకి తిరిగి జమ చేస్తామని మంత్రి గారు స్పష్టం చేశారు. 27వ తేదీన రాయదుర్గం, కెపిహెచ్‌బి కాలనీ, మైలార్‌దేవరపల్లి, రెడ్ హిల్స్, 28న కౌకూర్,పాటిగెడ్డ,జల్‌పల్లి, కుల్సుంపుర , 29న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయన్‌పల్లి, బండ్లగూడ ( ఎల్ఐజి కాలనీ), నందిముసలిగుడ, 30వ తేదీన గాజుల రామారం, అంబర్ పేటలోని సిటీపోలీస్ లైన్స్, గడ్డిన్నారం, ఆర్&బి క్వార్టర్స్,పోచారం ( ఎల్ఐజి కాలనీ)లో లక్కీడ్రా నిర్వహిస్తారని మంత్రి గారు తెలిపారు.మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాల ఎంపిక క్యూర్ పరిధిలో కొత్తగా మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థలాలను ఎంపిక చేశామని తెలిపారు .ఒక్కో నియోజకవర్గంలో 480 ఇళ్ల చొప్పున మొత్తం 1,920 ఇళ్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం లో హయత్‌నగర్ గ్రామంలోని అమంగల్, గోషామహల్ నియోజకవర్గంలోని నాంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గంలోని జమిస్తాన్‌పూర్ (ఆర్టీసీ క్వార్టర్స్), చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడలో (ఫలక్‌నుమా సమీపంలో) ఇళ్లు నిర్మించేందుకు వీలుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నాలుగు నియోజకవరాల పరిధిలోని అర్హులైన ప్రజలు ఇందిరమ్మ టవర్స్ కోసం సెప్టెంబర్ 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పొంగులేటి తెలిపారు. గతంలో 16 నియోజకవర్గాలకు వర్తింపజేసిన నిబంధనలే ఈ కొత్త దరఖాస్తులకూ వర్తిస్తాయన్నారు ఇందిరమ్మ టవర్స్ ప్రత్యేకత కేవలం అపార్ట్‌మెంట్‌లో ఒక ఇల్లు ఇవ్వడంలోనే లేదని నగరంలో విలువైన భూమిపై ఒక కుటుంబానికి శాశ్వత ఆస్తి, భద్రమైన భవిష్యత్, ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతిపాదిత ప్లాట్ విస్తీర్ణం 525 చదరపు అడుగులు. అన్‌డివైడెడ్ షేర్ విధానంలో సుమారు 20–25 గజాల భూమిని లబ్ధిదారుల పేరుతో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నామని ప్రాంతాన్ని బట్టి లబ్ధిదారులకు అందే భూమి విలువ రూ.60 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఉండనుందన్నారు. ఇంత విలువైన ఆస్తిని పేద కుటుంబానికి అందించడంతో పాటు, ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల పూర్తి సబ్సిడీ అందిస్తోందని లబ్ధిదారుడి వాటా కేవలం రూ.6 లక్షలు మాత్రమే, అది కూడా నాలుగు విడతల్లో చెల్లించే విధంగా అవకాశం కల్పించామన్నారు. జీవితాంతం అద్దె ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి నుంచి ఒక పేద కుటుంబాన్ని బయటకు తీసుకువచ్చి, నగరంలోనే సొంతింటి యజమానిగా నిలబెట్టడమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యమన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలి

**కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు పాటుపడాలని, మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు వేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు.వన మహోత్సవం సందర్భంగా మంగళవారం మెదక్ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో డీఎఫ్ఓ జోజి, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి కలెక్టర్ ప్రతిమా సింగ్ మొక్కలు నాటి నీరు పోశారు. కలెక్టర్ మాట్లాడుతూ... మెదక్ జిల్లాలో వన మహోత్సవం కింద 31 లక్షల 95 మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 19 లక్షల 43వేల 654 మొక్కలు నాటి 60.83 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో మొక్కలు, అడవులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతోపాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు.భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్ స్వరూప, ఎఫ్ఆర్ఓ గణేష్, ఎఫ్ఎస్ఓ స్రవంతి, అధ్యాపకులు, విద్యార్థినిలు అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

**రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 25. :** ప్రజాహితం కోసం విద్య, వైద్య రంగాలపై పెట్టే ఖర్చు భవిష్యత్తుకు నిజమైన పెట్టుబడి అని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రూ. 23.75 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రభాగాన నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని పాత భవనాల తొలగింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మిగిలిన ఖాళీ స్థలాన్ని రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు. విద్యుత్ ఖర్చులను తగ్గించుకునేందుకు ఆసుపత్రి భవనాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలన్నారు. హైదరాబాద్‌తో సమానంగా ఖమ్మంలోనూ అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చి, చుట్టుపక్కల జిల్లాల ప్రజల్లోనూ నమ్మకాన్ని పెంచాలని డాక్టర్లను ఆదేశించారు. చదువుకున్న ప్రతి బిడ్డ దేశానికి ఆస్తి అని, వారి కోసం విద్య, వైద్య రంగాల్లో చేసే ప్రణాళికాబద్ధమైన వ్యయం రాష్ట్రాన్ని, దేశాన్ని సౌభాగ్యంగా ఉంచుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూడా చైర్మన్ దుర్గాప్రసాద్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, ఆర్డీవో శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# ఎనగండ్లలో పురాతన శిల్పకళ

**దశావతార సహిత**
**యోగశయనమూర్తి**
**క్షీరసాగరమథన సహిత గజలక్ష్మి**





**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా కుల్చారం మండలం ఎనగండ్ల గ్రామంలో అపురూపమైన శిల్పకళా సంపద వెలుగు చూస్తోంది. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో పురాతన శిల్పాలు, శిల్పఖండాలు విస్తరించి ఉన్నాయి. ఇవి మెతుకుసీమ చారిత్రక వైభవానికి ముఖ్యమైన ఆధారాలని మెదక్ జిల్లా చరిత్ర పరిశోధకుడు బుర్ర సంతోష్ తెలిపారు.స్థానిక ఆంజనేయ ఆలయం సమీపంలో నల్లరాతిపై చెక్కిన గజలక్ష్మి శిల్పం అత్యంత ప్రత్యేకమైనది. సాధారణంగా ఆలయ ద్వారబంధాల వద్ద కనిపించే గజలక్ష్మి రూపానికి భిన్నంగా, ఈ శిల్పంలో క్షీరసాగర మథనం దృశ్యాన్ని కూడా అద్భుతంగా చెక్కారని సంతోష్ వివరించారు. ఒకవైపు దేవతలు, మరోవైపు రాక్షసులు వాసుకి, నాగును ఉపయోగించి సముద్రాన్ని మథిస్తున్న దృశ్యం ఇందులో కనిపిస్తుందని తెలిపారు. గజలక్ష్మి శిల్పానికి మరో వైపున విష్ణుమూర్తి రూపం కూడా చెక్కబడి ఉండటం దీని ప్రత్యేకతను మరింత పెంచుతుందని అన్నారు.అదే విధంగా హనుమాన్ ఆలయంలోని యోగ శయనమూర్తి శిల్పం కూడా విశేషమైన శిల్పకళకు నిదర్శనమని ఆయన తెలిపారు. యోగశయనమూర్తి చుట్టూ దశావతార రూపాలతో పాటు అష్టదిక్పాలకుల ప్రతిరూపాలు చెక్కబడి ఉండటం ఈ శిల్పం యొక్క కళాత్మక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు.ఎనగండ్ల గ్రామంలోని మరొక ప్రాంతంలో సోమసూత్ర సహిత శివలింగం, అష్టమాతృకల శిల్పాలు, కాలగర్భంలో ధ్వంసమైన అనేక శిల్పఖండాలు ఉన్నాయని బుర్ర సంతోష్ వివరించారు. గ్రామంలోని శిల్పాలను సమగ్రంగా పరిశీలించి, వాటి చారిత్రక నేపథ్యాన్ని నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. "ఇలాంటి అరుదైన శిల్పాలు మన మెదక్ జిల్లా చరిత్ర ఎంత పురాతనమైనదో తెలియజేస్తున్నాయి. మెతుకుసీమ చరిత్ర ఇలాంటి పురాతన శిల్పాలలో దాగి ఉంది. మన చరిత్ర, సంస్కృతి, కళా వారసత్వానికి ప్రతీకలైన ఈ శిల్పసంపదను సంరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని బుర్ర సంతోష్ అభిప్రాయపడ్డారు.మెదక్ జిల్లా చారిత్రక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో ఇటువంటి శిల్పసంపద కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

## వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడు చోరీ

**నిందితుడు అరెస్టు**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును బలవంతంగా లాక్కెళ్లిన చోరీ కేసును మెదక్ టౌన్ పోలీసులు ఛేదించారు. ఇన్స్పెక్టర్ మహేష్ మాట్లాడుతూ... పట్టణంలో సాయి నగర్ కాలనీకి చెందిన బాలెశెట్టి సులోచన ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నారు. ఈ నెల 22న అర్ధరాత్రి ఇంటి తలుపు కొట్టాడు. సులోచన తలుపు తెరవగానే బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించిన దొంగ ఆమె మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల రెండు వరుసల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో సులోచన బంగారు గొలుసును గట్టిగా పట్టుకోవడంతో అది తెగిపోయింది. కొంత బంగారం ఆమె చేతిలో మిగలగా, మిగిలిన ఆభరణాన్ని నిందితుడు తీసుకుని పరారయ్యాడు. ఆమె కేకలు విని పైఅంతస్తులో నివసిస్తున్న అల్లుడు కె. లింగంగౌడ్ కిందకు వచ్చేలోపే నిందితుడు పరారైనట్లు పోలీసులు తెలిపారు. చోరీకి గురైన బంగారు ఆభరణం విలువ సుమారు రూ.4.50 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి కుమారుడు బాలెశెట్టి సంతోష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి అనుమానితులపై నిఘా పెట్టారు. సోమవారం దాయర స్ట్రీట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా హవేలి ఘనపూర్ మండలం తొగిట గ్రామానికి చెందిన చాకలి మొగులయ్యను గుర్తించారు. విచారణలో సులోచన ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును బలవంతంగా లాక్కెళ్లినట్లు నిందితుడు అంగీకరించాడు. నిందితుడి పై గతంలో ఆటో దొంగతనం, రేషన్ బియ్యం అక్రమ తరలింపునకు సంబంధించిన కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకుని తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## డ్రగ్స్ నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

**డీసీపీ నారాయణ రెడ్డి**



**ముద్ర, మహేశ్వరం:** మాదకద్రవ్యాల ముప్పును ఎదుర్కోవడంలో చట్టపరమైన చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి అన్నారు.పీఐబీ–హైదరాబాద్ ఆధ్వర్యంలో మహేశ్వరంలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్'పై 'వార్త' మీడియా వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ నివారణ ఇళ్లలో, పాఠశాలల్లోనే ప్రారంభం కావాలని, యువతను అప్రమత్తం చేయాలని సూచించారు. మీడియా కచ్చితమైన, బాధ్యతాయుతమైన సమాచారాన్ని అందించాలని కోరారు.ఈగల్ ఫోర్స్ ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ జనవరి నుంచి తెలంగాణలో సుమారు 8 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డ్రగ్స్ కేసుల రిపోర్టింగ్‌లో మైనర్ల వివరాలను గోప్యంగా ఉంచాలని సూచించారు.పీఐబీ జాయింట్ డైరెక్టర్ డా. మానస్ కృష్ణకాంత్ మాట్లాడుతూ డ్రగ్స్ ముప్పు సామాజిక, శాంతి భద్రతలు, జాతీయ భద్రతకు సవాలుగా మారిందన్నారు. కార్యక్రమంలో సుమారు 60 మంది మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులకు తాజా వ్యవసాయ సూచనలు అందించిన 'రైతునేస్తం'

**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 25:** రైతులకు తాజా వ్యవసాయ సమాచారం, శాస్త్రవేత్తల సూచనలు అందించే 'రైతునేస్తం' 104వ భాగం మంగళవారం ప్రసారమైంది. వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి, ఐఏఎస్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.ఎల్‌నినో ప్రభావంతో వాతావరణం, వర్షపాతం, భూగర్భ జలాలు, సాగునీటి పరిస్థితులపై నిపుణులు వివరించారు. ప్రత్యామ్నాయ పంటలు, పంటల యాజమాన్యం, వర్షాకాలంలో కోళ్ల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నానో యూరియా వినియోగంపై శాస్త్రవేత్తలు సూచనలు అందించారు.'ఫ్రేమ్ వర్క్ ఫర్టిలైజర్ సేల్ యాప్' ద్వారా ఎరువులను బుక్ చేసుకునే విధానాన్ని వివరించారు. ప్రస్తుతం 22 జిల్లాల్లో యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయని, ఈ నెల 27 నుంచి మిగిలిన జిల్లాల్లోనూ సేవలు అందుబాటులోకి వస్తాయని డా. గోపి తెలిపారు.ఏడు రకాల సన్న వరి రకాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో రైతుల సాగు వివరాలను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## హెరిటేజ్ టూరిజం లోగో, అభివృద్ధిపై చర్చ

**కలెక్టర్ ప్రతిమా సింగ్**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా హెరిటేజ్ టూరిజం యొక్క కీర్తిని నలుదిక్కులా చాటే విధంగా లోగో బ్రాండింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం మొదటి విడత టూరిజం అభివృద్ధి కమిటీ సమావేశంలో 10 ఎజెండా అంశాలపై చర్చించారు. 7 కోట్ల రూపాయలతో ఏడుపాయల ఆవరణలో 12 కాటేజీల నిర్మాణం చేపట్టుటకు సంబంధించి టూరిజం శాఖ ద్వారా స్థల సేకరణ పూర్తి చేసి నిర్మాణ బాధ్యతలను టూరిజం, జిల్లా పంచాయతీ శాఖకు అప్పగించేలా కార్యచరణతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. మెదక్ పోర్టు అభివృద్ధిలో భాగంగా ప్రధాన రక్షణ, సెక్యూరిటీ గార్డ్స్ నియామకం, టూరిస్ట్ గైడ్ ఏర్పాటు హౌస్ కీపింగ్, యాత్రికుల టికెట్, పార్కింగ్ అంశాలపైచర్చించారు.ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటన్నింటిని ఆధీనంలోకి తీసుకుని పరిరక్షించి రక్షణ కంచే నిర్మించి పోర్ట్ ఏరియాలో పార్కింగ్ కు అనుకూలంగా తీర్చిదిద్దాలన్నారు.వీటన్నిటిని మెదక్ మున్సిపల్ కమిషనర్ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న మెదక్ ఖిల్లా, ఏడుపాయల వన దుర్గ భవాని దేవాలయం, పోచారం, వేల్పుగొండ, నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్.. ఈ ఏరియాలలో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేసి సందర్శకులకు నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవడం, కొన్ని ప్రాంతాలలో మొబైల్ ఫుడ్ వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. యాత్రికులు వీక్షణకు సంబంధించి రాష్ట్రస్థాయిలో హెరిటేజ్ డిపార్ట్మెంట్ సూచనలను పరిగణలోకి తీసుకుని మెదక్ పోర్టు వీక్షణకు యాత్రికులకు పెద్దలకు 20 రూపాయలు, పిల్లలకు 5 రూపాయలు టికెట్ ధర నిర్ణయించడం జరిగిందన్నారు.స్వదేశీ దర్శన్ లో భాగంగా మెదక్ పోర్టు, పోచారం ఈ రెండు కూడా ఇటీవల కేంద్ర బృందం సందర్శించడం జరిగిందని, త్వరలోనే కేంద్రం ద్వారా అనుమతి లభిస్తే 100 కోట్లు మంజూరు అవుతాయన్నారు. ఈ నిధులతో మెదక్ టూరిజం విశేషంగా అభివృద్ధి చెంది యాత్రికులకు సకల సౌకర్యాలు కల్పించడంతో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది అన్నారు ఏడుపాయల టెంపుల్ ఆవరణలో అసైన్డ్ ల్యాండ్లను గుర్తించి వాటిలలో ఫుడ్ కోర్టు, పార్కింగ్ ఏరియాలో ఏర్పాటు దిశగా కార్యచరణ రూపొందించాలన్నారు ఖిల్లాకు ప్రస్తుతం వచ్చిన 57 లక్షలు నిధులతో హెరిటేజ్ డిపార్ట్మెంట్ వారు పనులు టేకప్ చేయడానికి సీసీటీవీ కెమెరాల నిర్మాణానికి 5 లక్షల రూపాయలు వెచ్చించడం జరుగుతుందని, అలాగే మిగతా మరమ్మత్తులకు వసతులకు 21 లక్షలు కేటాయిస్తూ టెండర్ పిలవడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ జోజి, డిఆర్డిఓ శ్రీనివాసరావు, టూరిజం అధికారి రమేష్, ఈడియం సందీప్, డిపిఆర్ఓ రామచంద్ర రాజు, మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్ పాల్గొన్నారు. హైదరాబాదు నుండి వర్చువలా రాష్ట్ర పర్యాటక శాఖ సహాయ సంచాలకులు ఓం ప్రకాష్, హెరిటేజ్ డిపార్ట్మెంట్ టెక్నికల్ డైరెక్టర్ డి. మల్లు, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డిఇ శ్రీశైలం హాజరయ్యారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555